



# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శనివారం 13-08-2022 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 45 సంచిక : 280 పేజీలు : 08 వెల : 1 రూపాయి


## నిజమైన చర్చ జరగాలి..

### కేజ్రీవాల్‌కు నిర్మలా సీతారామన్ కౌంటర్



ఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం పేదవాళ్లపైనే పన్నుల భారం మోపుతూ.. ధనికులకు మాత్రం భారీ స్థాయిలో రుణ మాఫీలు చేస్తోందంటూ దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ఉచితాలపై కేజ్రీవాల్ అసంబద్ధ వాదనలు చేస్తున్నారని విమర్శించారు. ఉచిత హామీలు, పథకాలపె చర్చ జరగాలన్నారు. 'విద్య, వైద్య సేవలను ఎప్పుడూ ఉచితాలుగా పేర్కొనలేదు. దేశంలో ఏ ప్రభుత్వమూ వాటిని తిరస్కరించలేదు. కాబట్టి.. విద్య, వైద్యాన్ని ఉచితాలుగా వర్గీకరిస్తూ.. పేదల్లో భయాందోళన కలిగించేందుకు కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంపై నిజమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది' అన్నారు. 'కేజ్రీవాల్ ఉద్దేశ పూర్వకంగా తప్పుడు వాదనలు చేస్తున్నారు.

పేదలకు ఉచిత ప్రయోజనాలు ఇవ్వడం తప్పు అని ఎవరూ అనడం లేదు. అయితే.. రుణమాఫీని ఉచితా లుగా వర్గీకరించడం, కార్పొరేట్‌లకు ప్రయోజనం చేకూర్చేందుకే పన్ను రేట్లను తగ్గిస్తున్నారని చెప్పడం కూడా తప్పే' అని సీతారామన్ వ్యాఖ్యానించారు. గుజరాత్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న వేళ.. ఉచిత హామీలు, పథకాలపై భాజపా, ఆమ్ ఆద్మీ పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోన్న సంగతి తెలిసిందే.

ఈ క్రమంలో గత కొంతకాలంగా తరువాయి 2లో..

# అన్ని స్కూళ్లకు ఇంటర్నెట్

- పీడీఎఫ్ రూపంలో పాఠ్యాంశాలు
- స్కూళ్లకు ఎలాంటి మరమ్మత్తు వచ్చినా వెంటనే బాగు చేసే విధానం
- డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయాలి

## ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖపై సమీక్ష



**తాడేపల్లి, (విజయభాను న్యూస్) :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖపై సమీక్ష చేపట్టారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సీఎస్ సమీర్‌శర్మ, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ మేరకు స్కూళ్ల నిర్వహణ కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం జగన్ ఆదేశించారు. స్కూళ్లకు ఎలాంటి మరమ్మత్తు వచ్చినా వెంటనే బాగు చేసే విధానం ఉండాలన్నారు. అదే సమయంలో అన్ని స్కూళ్లకు ఇంటర్నెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం జగన్ స్పష్టం చేశారు.

వచ్చే ఏడాది విద్యాకానుక కింద అందించే వస్తువులను ఏప్రిల్ చివరినాటికే సిద్ధం చేయాలన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులను వెంటనే ప్రొక్యూర్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి తరగతి గదిలో డిజిటల్ బోధన కోసం టీవీ ఏర్పాటుపై కార్యాచరణ సిద్ధం చేయాలని, దశలవారీగా డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని సీఎం జగన్ సూచించారు.

ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ నాడు - నేడు కింద పనులు పూర్తిచేసుకున్న తరువాయి 2లో..

## జాతీయ జెండా ప్రతి ఇంటి పై ఎగరాలి

### - జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఆగస్టు 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు జాతీయ జెండా ప్రతి ఇంటి పై ఎగిరే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ ఆదేశించారు. శుక్రవారం ఆయన "ఫ్రైడే - డ్రైడే" సందర్భంగా 5వ జోన్, 52వ వార్డు పరిధిలోని గాంధీ నగర్, అంబేద్కర్ నగర్, సంజీవయ్య నగర్, నేతాజీ నగర్, మర్రిపాలెం ఉడా లే-అవుట్ తదితర ప్రాంతాలలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం "హార్ ఘర్ తిరంగా" లో భాగంగా ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగురవేయాలని అందుకు తగిన జెండాలను ఇప్పటికే పంపిణీ చేశామని, జాతీయ జెండాని కట్టేటప్పుడు జాగ్రత్తలు పాటించి, జెండాకు అగౌరవం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వార్డులో ఏర్పాటుచేసిన జెండాతో సెల్ఫీ తీసుకొని కమిషనర్ యాప్ లో అప్లోడ్ తరువాయి 2లో..

## విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ..

## కేంద్రం మరో ఎత్తుగడ

### : బీవీ రాఘవులు



విశాఖపట్నం : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం మరో ఎత్తుగడ వేసిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. ఉత్పత్తిని తగ్గించి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకే మొగ్గు చూపుతోందని విమర్శించారు. 24వేల టన్నుల ఉత్పత్తికి గాను కేవలం 15 వేల టన్నుల ఉత్పత్తి మాత్రమే జరుగుతోందని వెల్లడించారు. అంతర్జాతీయంగా బొగ్గు ధర పడిపోయిందన్నారు. భాజపా ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాసి, ప్రైవేటు పరం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. అనకాపల్లిలో జరిగిన మినీ మహానాడులో, వైకాపా ప్లీనరీలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎలాంటి తీర్మానాలు చేయలేదని రాఘవులు ఆక్షేపించారు.



రాఖీ పౌర్ణమి సందర్భంగా టీటీడీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి కి రాఖీ కడుతున్న మహిళా కమిషన్ చైర్పర్సన్ వాసిరెడ్డి పద్మ. మహిళా కమిషన్ మెంబర్ బూసి వినీత.




# కొత్త పరిశ్రమల స్థాపనతో ఆర్థిక ప్రగతి

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి : జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డా. ఏ.మల్లిఖార్జున ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ఔత్సాహిక పారిశ్రామివేత్తలకు ప్రోత్సాహం అందివ్వాలన్నారు. ఈనెల 11 వ తేదీ నాటికి సింగిల్‌డెస్క్ పోర్టల్‌లో 82 దరఖాస్తులు రాగా అందులో 38 దరఖాస్తులు తరువాయి 2లో..

# జూట్ బ్యాగ్ ను సోదర భావంతో భావించి రాఖీలను కట్టిన జివిఎంసి మహిళా ఉద్యోగులు

*- జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ*

*- జివిఎంసి మహిళా ఉద్యోగులు పర్యావరణహితపరంగా వినూత్న కార్యక్రమం*

*- రక్షాబంధం కేవలం సోదర బంధమే కాకుండా ప్రకృతి బంధం కూడా అంటున్న జివిఎంసి మహిళా ఉద్యోగులు.*




**విశాఖపట్నం, మెట్రోవాయిస్ న్యూస్** : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో "నార సంచులకు" జివిఎంసి మహిళా ఉద్యోగులు రాఖీలు కట్టి పర్యావరణహితపరంగా వినూత్న ప్రచారాన్ని చేయడం అభినందించదగినదని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ పేర్కొన్నారు. శనివారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జివిఎంసి మహిళా అధికారులు, ఉద్యోగులు ఏర్పాటు చేసిన జూట్ బ్యాగ్ బంధన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ వినూత్న కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నుండి విశాఖ నగరానికి విముక్తి కలిగించుటకు పర్యావరణ మార్పు దిశగా పయనిస్తున్న నగర ప్రజలను జివిఎంసి అభినందిస్తున్నదని తెలిపారు.

ఈ రోజు జివిఎంసి మహిళా అధికారులు, ఉద్యోగులు చేపట్టిన వినూత్నమైన కార్యక్రమం ఇది వరకు ఎక్కడా కూడా జరిగి ఉండదని భావిస్తున్నానన్నారు. ఈ రక్షాబంధనం నాడు దేశంలో ఉన్న అక్కా చెల్లెలు, అన్న తమ్ముళ్లు ఎంతో సంతోషంతో, ఆప్యాయంతో, ప్రేమను పంచుకుంటూ రాఖీ పండుగను జరుపుకుంటారన్నారు. ఈ రాఖీ పండుగనాడు కేవలం సోదరులకు రాఖి కట్టడమే కాకుండా, మనకు నిత్యం వినియోగంలో ఉన్న పర్యావరణహితపరమైన వస్తువులను, ప్రకృతిని మనం ఎప్పుడూ ప్రేమించాలంటూ, ఈ రోజు నార సంచులకు రాఖీలను కట్టి జూట్ బ్యాగ్ బంధన్ అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించిన జివిఎంసి మహిళా అధికారులను, ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. పర్యావరణ పరిరక్షణ దిశగా ఈ కార్యక్రమం అందరికీ స్ఫూర్తిదాయకమని కమిషనర్ అన్నారు. అనంతరం మహిళా అధికారులు, ఉద్యోగులు మాట్లాడుతూ, విశాఖ నగరంలో ప్రజలకు సేవలు అందించే దిశగా జివిఎంసి యంత్రాంగం నిత్యం కృషి చేస్తుందన్నారు. మన నగరంలో ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలకాలంటూ, పర్యావరణహితమైన వస్తువులను వినియోగించాలంటూ జివిఎంసి ప్లాస్టిక్ వస్తువులను నిషేధించిందన్నారు.

ఈ ప్లాస్టిక్ నిషేధానికి జివిఎంసి ఉద్యోగులు, అధికారులు చిత్తశుద్ధితో ప్రజలలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.

ఈ రోజు రాఖీ పర్వదినం సందర్భంగా అన్నదమ్ములకు రాఖీ కట్టడమే కాకుండా, నిత్యం మనతో పెనవేసుకుంటున్న పర్యావరణహితపరమైన వస్తువులను కూడా మనం ప్రేమించాలంటూ, వాటిని గుర్తు చేసుకుంటూ వినూత్నంగా ఈ రోజు సోదర భావంతో జూట్ బ్యాగ్ బంధన్ పేరుతో నార సంచులకు మహిళా ఉద్యోగులు అందరం రాఖీలు కట్టడం జరిగిందన్నారు. తద్వారా ఇతరులకు పర్యావరణ వస్తువుల వినియోగం, పరిరక్షణపై అవగాహన కలుగుతుందని భావిస్తూ ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని వారు అన్నారు. ఈ వినూత్న కార్యక్రమంలో జివిఎంసి ఉన్నతాధికారులు, ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ పై యుద్ధానికి సిద్ధమైన విద్యా సంస్థలు




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్లాస్టిక్ నిషేధానికి విద్యా సంస్థలు సహకారమ ఏనాలేదని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ పేర్కొన్నారు. శుక్రవారం, ఆయన 6వ జోన్ గాజువాకలోని సమతా నగర్ ప్రాంతంలో ఉన్న యాపిల్ ఐ స్కూలు వారు ప్లాస్టిక్ నిషేధంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో గాజువాక శాసన సభ్యులు తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ స్టాలిన్ తో కలసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్లాస్టిక్ నిర్మూలనకు ముందుకు వచ్చి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న యాపిల్ ఐ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థి దశ నుండే పిల్లలకు ఇటువంటి కార్యక్రామాల ద్వారా అవగాహన కల్పిస్తే త్వరలోనే మనం ప్లాస్టిక్ రహిత విశాఖను చూడగలమని తెలిపారు. ప్లాస్టిక్ లో ప్రాణాంతకరమైన రసాయనాలు ఉంటాయని, అవి మానవ మనుగడకే హానికరమని, ప్రస్తుతం పెద్ద వారికే కాకుండా చిన్న పిల్లలకు కూడా క్యాన్సర్ లాంటి వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధానికి ఇప్పటికే ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని తెలిపారు. ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయ వస్తువుల కొరకు ఈ నెల 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు బీచ్ రోడ్డులో "ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ మేళా" నిర్వహిస్తున్నామని, పిల్లలందరూ వారి వారి తల్లిదండ్రులతో ఈ మేళాను సందర్శించాలని సూచించారు. అనంతరం శాసనసభ్యులు మాట్లాడుతూ మా చిన్న తనంలో అరటి, విస్తరాకులు లాంటి వాటిని ఉపయోగించేవారమని, నేడు ప్రాణాంతకరమైన ప్లాస్టిక్ ను వాడుతున్నామని తెలిపారు. ఇలాగే వాడుకుంటూ పోతే మానవ జాతికి కాకుండా జలజీవరాశులతో పాటూ పశుపక్ష్యాదులకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. అందువలన ప్రతి విద్యార్థి మీ తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, మీరే ఇంటిలో ప్లాస్టిక్ ను వాడకుండా చూడాలని పిల్లలకు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బాల కృష్ణ, స్కూల్ ప్రిన్సిపాల్ ఆచార్య, జోనల్ కమిషనర్ పి. సింహాచలం, డిసి(రెవెన్యూ) ఫణిరాం, కార్యనిర్వాహక ఇంజినీరు, ఎఎంఓహెచ్ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్ముల సేవలు మహనీయం..

**- దేశభక్తి గీతాల సీడీని ఆవిష్కరించిన కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : భారత స్వాతంత్ర పోరాటంలో ఎంతోమంది మహాత్ములు అందించిన సేవలు మహనీయమని జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున అన్నారు. మహాత్ములు పోరాట పటిమ వల్లే నేడు మనమంతా స్వాతంత్ర ఫలాలు అనుభవిస్తున్నామన్నారు. సింహాచలం ప్రాంతానికి చెందిన ఎంబీఏ విద్యార్థి గంట్ల పండు స్వాతంత్ర దినోత్సవం (ఆజాద్ కి అమృత్ మహోత్సవ్) నేపథ్యములో రచించి, రూపొందించిన దేశభక్తి గీతాల సిడిని శుక్రవారం జిల్లా కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున తన చాంబర్ లో ఆవిష్కరించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల పూర్తి కావస్తున్న సందర్భంగా స్వాతంత్ర స్ఫూర్తిని అందరిలో నింపే విధంగా ఇటువంటి దేశభక్తి గీతాలు సిడిని రూపొందించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ దేశభక్తితో ముందుకు సాగుతూ మన దేశం యొక్క గొప్పతనాన్ని ఇతర దేశాలకు చాటి చెప్పాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థి గంట్ల పండు ను అభినందించారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్త గా వ్యవహరించిన అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యులు , జాతీయ జర్నలిస్టుల సంఘ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ దేశమంతా 75 ఏళ్లు స్వాతంత్ర దినోత్సవ సంబరాలు జరుపుకుంటున్న తరుణంలో ఇటువంటి దేశభక్తిగీతాల కోసం తన వంతు సహకారం అందించడం సంతోషం కలిగించిందన్నారు.

## స్థలం ఉన్న లేదని అధికారులు డ్రామాలు

**- 22వ వార్డులో యూపీహెచ్ సీ నిర్మాణం చేయాల్సిందే**

**- జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ డిమాండ్**



మద్దిలపాలెం(విజయభాను న్యూస్): జీవీఎంసీ జోన్-3 పరిధి 22వ వార్డు పిఠాపురంకాలనీకి మంజూరు చేసిన డా.వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని 15 కిలోమీటర్ల దూరంగా నగర శివారులోని జోన్-2 పరిధి 5వ వార్డు మారికవలస గ్రామంలో నిర్మాణం చేసిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుని పిఠాపురం కాలనీలో వైస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం మంగళగిరిలో రాష్ట్ర వైద్య ఆరోగ్య%డ%కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ డైరెక్టర్ జె.నివాస్ కు 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహావిశాఖ నగర పాలక సంస్థ జోన్-3 పరిధి 22వ వార్డు(పాత16వ వార్డు) సుమారు 30 వేల జనాభతో నగరంలోనే అతిపెద్ద వార్డుగా ఉందన్నారు. వార్డులో శివాజిపాలెం, శివానందాపురం, రేసపువాని పాలెం, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం, బలరాం నగర్, తారమసీదు వంటి ఏరియాల్లో వేల సంఖ్యలో పేదలు నివాసముంటున్నారన్నారు. ఇక్కడ వైద్య సేవలు అందించేందుకు నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ వారు నగరంలో మంజూరు చేసిన 42 వైస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్ లలో పిఠాపురం కాలనీ డా.వైస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఏర్పాటకు జీవో నంబర్ 722 విడుదల చేసారని తెలిపారు. నగరంలో మంజూరైన 42 వైస్సార్ అర్బన్ హెల్త్ క్లీనిక్ ల ఏర్పాటు పర్యవేక్షించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డిపిఎంవో నీలాపు రామిరెడ్డి పిఠాపురం కాలనీ యూపీహెచ్ సీ నిర్మాణం చేయటకు స్థల పరిశీలన చేయకుండానే 22వ వార్డులో స్థలం లేదని జిల్లా కలెక్టర్ కు తప్పుడు సమాచారం అందించి మారికవలసలో నిర్మాణం చేశారని చెప్పారు. వార్డులో శివానందపురంలో జీవీఎంసీకి చెందిన 400 గజాల ఖాళీ స్థలం ఉన్నప్పటికీ కార్పొరేటర్ గా స్థలం కోసం తనను కూడా సంప్రదించకుండా ఏక పక్ష నిర్ణయంతో పిఠాపురం కాలనీ యూపీహెచ్ సీ ని 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పక్క జోన్లోని 5వ వార్డు మారికవలసకు తరలించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డులో ఆరోగ్య సమస్యలు వస్తే మారికవలస వెళ్ళాలా మేమని ప్రశ్నించారు. పిఠాపురం కాలనీ కి మంజూరైన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మారికవలసలో నిర్మాణం చేయడానికి అడ్డదారులు తొక్కిన అధికారులపై చర్యలు తీసుకుని 30 వేల జనాభా కలిగిన 22వ వార్డులో పిఠాపురం కాలనీ అర్బన్ హెల్త్ క్లినిక్ ఏర్పాటుకు చొరవ చూపి పేదలకు వైద్య సేవలు అందించాలనివైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నివాస్ కి కోరామన్నారు. అయన స్పందించి చర్యలు తీసుకుంటామని హమీ ఇచ్చారని పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# అన్ని స్కూళ్లకు ఇంటర్నెట్

స్కూళ్లలో నిర్వహణ బాగుండాలి, దీనికోసం ఎస్‌ఓపీలను రూపొందించాలి ఒక ప్రత్యేక అధికారికి స్కూళ్ల నిర్వహణ బాధ్యతలు అప్పగించండి స్కూళ్లకు కల్పించిన సౌకర్యాల నిర్వహణ విషయంలో ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే మరమ్మతులు నిర్వహించేలా విధానం ఉండాలి వచ్చే సమీక్షా సమావేశం నాటికి దీనికి సంబంధించిన విధి విధానాలు రూపొందించాలన్న సీఎం ఒక ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కూడా రూపొందించాలని సీఎం ఆదేశాలు అన్ని స్కూళ్లకూ ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలన్న అత్యుత్తమ బోధనకు ఇది దోహదపడుతుందన్న స్కూళ్లకు కాంపౌండ్ వాల్స్ తప్పనిసరిగా ఉండాలి, వీటిపై దృష్టిపెట్టాలి. జగనన్న విద్యా కానుకపై సీఎం సమీక్ష

వచ్చే ఏడాది విద్యాకానుకకు సంబంధించి ఇప్పటినుంచే అన్నిరకాలుగా సిద్ధంకావాలని సీఎం ఆదేశాలు ఏప్రిల్ నాటికే విద్యా కానుక కింద అందించే వాటిని సిద్ధంచేసుకోవాలన్న సీఎం

సమావేశంలో పిల్లలకు అందిస్తున్న యూనిఫామ్ నాణ్యతను పరిశీలించిన సీఎం. ట్యాబ్‌ల పంపిణీపైనా సమీక్ష 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించే కార్యక్రమంపైనా సీఎం సమీక్ష టెండర్లు ఖరారుచేసి వెంటనే ఆర్డర్ ఇవ్వాలని సీఎం ఆదేశం

తరగతి గదుల డిజిటలైజేషన్‌మీద సీఎం సమీక్ష స్మార్ట్ టీవీ లేదా ఇంటరాక్టివ్ టీవీ ఏర్పాటుపైనా సీఎం సమీక్ష ప్రతి తరగతి గదిలోనూ ఏర్పాటుపై కార్యాచరణ సిద్ధంచేయాలని సీఎం ఆదేశం

పాఠ్యపుస్తకాలకు సంబంధించిన కంటెంట్‌ను అందరికీ అందుబాటులో పెట్టండి పీడీఎఫ్ ఫైల్స్ రూపంలో అందరికీ అందుబాటులో ఉండేలా చూడండి. దీనివల్ల లిబరల్‌గా అందరికీ పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వస్తాయి. అంతేకాక ప్రభుత్వేతర స్కూళ్లు ఎవరైనా ప్రభుత్వ ముద్రణా సంస్థ నుంచి పాఠ్యపుస్తకాలు కావాలనుకుంటే.. నిర్ణీత తేదీలోగా ఎన్ని పుస్తకాలు కావాలో వివరాలు తీసుకుని ఆమేరకు వాటిని అందించండి ఎక్కడా కూడా పాఠ్యపుస్తకాల కొరత అనేది ఉండకూడదు అధికారులకు స్పష్టం చేసిన సీఎం బాలికల భద్రతపై అవగాహన రక్షణ, భద్రత, ఆరోగ్యం తదితర అంశాలపై స్కూళ్లలో విద్యార్థినులకు సరైన అవగాహన కల్పించాలన్న సీఎం జగన్ గ్రామ సచివాలయం నుంచి మహిళా పోలీసు, ఏఎన్ఎం తరచుగా వీరిని కలిసి అవగాహన కల్పించాలన్న సీఎం జగన్ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక మహిళా ఉపాధ్యాయురాలిని కౌన్సెలింగ్ కోసం నియమించాలన్న సీఎం జగన్.

## జాతీయ జెండా ప్రతి ఇంటి పై ఎగరాలి

చేశారు. అనంతరం సీజనల్ వ్యాధులపైన "ఫ్రైడే - డ్రైడే" పైన ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, కుండీలో నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాలు పొడుగా ఉంచాలని, దోమతెరలు ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. కాలువలు ప్రధాన రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, దోమలు వృద్ధి చెందకుండా స్ప్రేయింగ్, ఫాగింగ్ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎనిమిది వేల మంది ఓటర్లు ఉన్న కరాచీ ప్రాంతంలో అంగన్వాడి కేంద్రం లేదని, ఈ ప్రాంతంలో పార్క్ లో నిరుపయోగంగా ఉన్న యోగా భవనాన్ని అంగన్వాడీ కేంద్రానికి కేటాయించాలని, సంజీవయ్య కాలనీ, శాంతిపురం, ఉడా లే-అవుట్ తదితర ప్రాంతాలలో ఉన్న గ్రీన్ బెల్ట్ లను అభివృద్ధి పరిచి, పిల్లలు ఆడుకునే పరికరాలు, లైటింగ్ ఏర్పాటు చేయాలని డిప్యూటీ మేయర్ వినతిపత్రాన్ని కమిషనర్ కు అందించగా స్పందించిన కమిషనర్ వినతి పత్రంలో ఉన్న ప్రతి అంశాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో వార్డు స్పెషల్ ఆఫీసర్, జెడి(అమృత్) విజయ భారతి, జోనల్ కమిషనర్ ఆర్ జి వి కృష్ణ, ఏసీపీ అరుణ వల్లి, కార్యనిర్వాహక ఇంజనీర్ టి. ప్రసన్న, ఏఎమ్ఓహెచ్ డాక్టర్ రాజేష్, డి.ఇ. ఏడు కొండలు, ఇతర జివిఎంసిల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పరిశ్రమల స్థాపనతో ఆర్థిక ప్రగతి

నిర్దేశించిన గడువులోగా ఆమోదించామని, 1 దరఖాస్తు తిరస్కరించడం జరిగిందని, మిగిలిన 43 ఎస్ ఎల్ ఏ పరిధిలో ఉన్నాయని వివరించారు. అప్లికేషన్లు పెండింగ్ లేకుండా చూడాలని పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి అధికారిని ఆదేశించారు. గాజువాక లో నిర్మిస్తున్న కార్మిక రాజ్య భీమా ఆసుపత్రి కి సంబంధించి అన్ని అనుమతులు సత్వరం మంజూరు చేయాలని జీవీఎంసీ, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎస్.సి/యస్. టి ఔత్సాహికులకు గతంలో కేటాయించి తిరిగి తీసుకున్న ఐ లా భూములలో 72 మందికి గానూ 54 మందికి తిరిగి కేటాయించామని తెలిపారు. మిగిలిన వాటిని కూడా పరిశీలించి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. 25 పరిశ్రమలకు రూ. 4 కోట్లు ప్రోత్సాహకాలు అందించినట్లు తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ఉన్న పరిశ్రమల పార్కులలో ఘన వ్యర్థాల నిర్వహణ పై తీసుకున్న చర్యల గూర్చి చర్చించారు. గాజువాక , ఆటోనగర్ నందు నీటి సరఫరాని జీవీఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది వెంటనే పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలియజేసారు. గాజువాకలో ఆటోనగర్ వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి పనులు త్వరగా ప్రారంభించాలని ఏపీఐఐసి, ఐలా అధికారులను ఆదేశించారు . జిల్లా ఎగుమతి కార్యాచరణ ప్రణాళిక 2022 కు గానూ సముద్ర ఉత్పత్తులు, ఇంజనీరింగ్ గూడ్స్, హెల్త్ సర్వీసెస్ విభాగాలలో ఎంపిక చేసినట్లు తెలిపారు. మధురవాడ ఐ.టి సెజ్ ఉద్యోగులకు బస్సు సదుపాయం ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కొత్తగా పీ.యస్.యు ల కోసం భూమి సేకరణ, అభివృద్ధికి ప్రతిపాదనలు చేయాలని అధికారులు ఆదేశించారు. ఏపీఐఐసి కి సంబంధించి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఈకార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి రామలింగేశ్వరరాజు, ఏపీఐఐసీ జెడ్ఎం రంగయ్య, ఐలా చైర్మన్ రఘు, ఏపీ ట్రాన్స్‌కో, జీవీఎంసీ, వ్యవసాయ, మత్స్య శాఖ, అగ్ని మాపక, టౌన్ ప్లానింగ్, , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిజమైన చర్చ జరగాలి..

### కేజ్రీవాల్‌కు నిర్మలా సీతారామన్ కౌంటర్

ప్రధాని మోదీపై కేజ్రీవాల్ విమర్శలు గుప్పిస్తున్నారు.

కేంద్ర మంత్రులకు ఉచిత విద్యుత్ ఇస్తుండగా.. సామాన్య ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తే తప్పేంటని ఇటీవల కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఉచిత పథకాల పేరుతో ఓటర్లను మభ్యపెట్టే వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ ప్రధాని మోదీ ఇటీవల పిలుపునిచ్చిన నేపథ్యంలో దిల్లీ సీఎం ఈ మేరకు స్పందించారు.

# 87వ వార్డ్ కణితి కాలనీలో జాతీయపతాకావిష్కరణ



గాజువాక (విజయభాను న్యూస్ ): జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి కణితి కాలనీ గాంధీ బొమ్మ సెంటర్ వద్ద స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఆజాద్ క అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధుల ఆధ్వర్యంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, భారత్ డైనమిక్స్ జనరల్ మేనేజర్ ఎస్.వి కామేశ్వర్ లు శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గాంధీ బొమ్మ కి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించి కణితి సచివాలయం పరిధిలో గల ఇంటి ఇంటికి జెండలా పంపిణి కార్యక్రమం చేపట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 13,14,15 వ తేదీలు లో జెండా పండుగ సందర్భంగా మూడు రోజులు ప్రతి ఇంటిలో త్రివర్ణ పతాకం ఎగురవేయాలన్నారు. ఎందరో దేశ భక్తుల ప్రాణ త్యాగంతో స్వాతంత్ర్యం సిద్ధించిందని, అటువంటి త్యాగమూర్తులను దేశం ఎప్పటికి మర్చిపోదని, వారి త్యాగాలను స్మరించుకోవడం, వారి అడుగుజాడలలో నడవడం , వారి ఆశయ సిద్ధికి కట్టుబడి ఉండడం మన కర్తవ్యం అని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో భారత్ ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్, హెచ్ ఆర్ టీం , ఎంప్లాయిస్, 87వ వార్డ్ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి కోమటి శ్రీను , జిల్లా కార్యదర్శి ప్రగాఢ వేణు బాబు, నాయకులు ముద్దపు దామోదర్,బొడ్డ గోవిందా, దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు,ఎన్నటి రమణ,ప్రగాఢ శ్రీనివాస్, మడిస రాజు, మార్పు శేష్, శిరపు పాపారావు, జె ఈశ్వర్ రావు గోనప సన్యాసినాయడు, ప్రగడ శంకర్రావు,బొడ్డ సన్యాసిరావు, బొడ్డ వెంకట సూరి, ఏ శ్రీను, పిన్నింటి సంతోష్, కోమటి రమాదేవి,ఎల్ఐసి నాయుడు, పేరూరు గణేశ్వరరావు, డి.అప్పుడు, కె.వి నారాయణ, పూడి శీను,బుల్లెట్ రమణ సిహెచ్ గంగరాజు మార్పు గోవిందా డబ్బాలు సత్తిబాబు, ఉడా నానాజీ, వివిధ అధికారులు తదితరులు పాల్గొన్నవారు.

# రక్తదాన శిబిరానికి విశేష స్పందన



సబ్బవరం (విజయభాను న్యూస్) : మండలంలోని మల్లునాయుడు పాలెంలో స్వర్గీయ సింగంపల్లి సూర్య నారాయణ ఐదవ వర్ధంతి ని పురస్కరించుకొని సూర్య నారాయణ మిత్రబృందం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ నియోజక వర్గ టీడీపీ ఇంచార్జి గండి బాబ్జి ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యనారాయణ యాక్సిడెంట్ లో మరణించి అయిదు సంవత్సరాలు గడచినా ఆయన మిత్రబృందం ప్రతి ఏటా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి వారి అభిమానాన్ని చాటుకోవడం ఆనందదాయకమన్నారు. రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండి దేముడు, మాజీ ఎంపీటీసీ గండి రవి కుమార్, అనిమిరెడ్డి అప్పలనాయుడు, సింగంపల్లి నర్సింగరావు, టి. శివ, వై. సతీష్ బ్లడ్ బ్యాంకు డాక్టర్ వసంతరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్. పీ.యూతో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు

## - అడ్మిషన్ కార్యాలయాన్ని ప్రారంభించిన మేయర్ హరి వెంకట కుమారి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విద్యార్థులకు హైయర్ ఎడ్యుకేషన్ అందించేందుకు ముందుకు వచ్చిన లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ యాజమాన్యానికి విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అభినందనలు తెలియజేశారు. నగరంలో ఆశీలుమెట్ట జోన్-3 కార్యాలయం ఎదురుగా శుక్రవారం యూనివర్సిటీ అడ్మిషన్ కార్యాలయాన్ని ఆమె తో పాటు యూనివర్సిటీ సౌత్ హెడ్ సంజయ్ కుమార్ ముఖ్య అతిథిలుగా హాజరై ప్రారంభిం చారు. ఈ సంద ర్భంగా మేయర్ మాట్లాడుతూ పంజాబ్ లో ప్రముఖ పేరు గాంచిన లవ్లీ ప్రొఫెషనల్ విశ్వవిద్యాలయంలో చేరాలన్న ఔత్సాహిక విద్యార్థులకు జీవి తంలో స్థిరపడే కోర్సులతో పాటు ఉద్యోగ అవ కాశాలు కల్పించే దిశగా ఇక్కడే విశా ఖలో అడ్మిషన్ కార్యా లయం ప్రారంభించడం ఆనంద దాయ ుకమన్నారు. యూని వర్సిటీ సౌత్ హెడ్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ ఇంటర్ లో మంచి మార్కులు సాధించిన వారికి యూనివర్సిటీలో 350 కోర్సులకు అడ్మిషన్లు లభిస్తాయన్నారు. ఇప్పటికే స్వదేశీ తో పాటు విదేశీ విద్యార్థులు కూడా విద్యను అభ్యసించి ఉన్నత స్థానంలో ఉన్నారని గుర్తు చేశారు.

500కు పైగా ఎం.ఎన్.సి కంపెనీలతో తమ సంస్థ భాగస్వాము లయిందని తెలిపారు. డిప్లమా నుండి పీ.హెచ్.డీ వరకు వివిధ కోర్సులు బీబీఏ, అగ్రికల్చర్, ఇండస్ట్రీ కోర్సులకు విద్యార్థుల కౌన్సిలింగ్ తో పాటు పంజాబ్ లో యూనివర్సిటీ చదువుకునేందుకు ఇక్కడే అడ్మిషన్ లభించే విధంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్షిప్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైజాగ్ కార్యాలయ ఇన్చార్జి శరత్, తేజా తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ బీచ్ లో సెయింట్ ఆన్స్ విద్యార్థినుల ర్యాలీ



ములగాడ (విజయభాను న్యూస్): ఆజాదీకా అమృత మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం సముద్ర తీరంలో హెచ్.పి.సి.ఎల్. ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో సెయింట్ ఆన్స్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీరంతా జాతీయ జెండాలను చేపట్టి, భారత మాతాకీ జై, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. ర్యాలీకి జాతీయ సేవా పథకం జూనియర్ కళాశాల ప్రోగ్రాం అధికారి సంధ్యారాణి నాయకత్వం వహించారు. ర్యాలీలో పాల్గొన్న వారిని సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమ కుమారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానీస్, అధ్యాపకులు సిబ్బంది, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు ఈపీఎస్ భాగ్యలక్ష్మి, వై. అనసూయా దేవి, వి.అంజలి దేవి, నదియా తదితరులు అభినందించారు. ఈ ర్యాలీ తమలో ఐక్యతను, ఉత్సాహాన్ని, దేశభక్తిని నింపిందని ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినిలు, జాతీయ సేవా పథక కార్యకర్తలు అన్నారు.

# దేశ సమగ్రతను దేశ సార్వభౌన్నత్యాన్ని కాపాడాలంటే

# ప్రతీ ఒక్కరూ బాధ్యత గల వ్యక్తిగా మసలు కోవాలి

## దివీస్ జనరల్ మేనేజర్ వైయస్ కోటేశ్వరరావు



భీమునిపట్నం : విజయబాను న్యూస్ : డెబ్బై అయిదు సంవత్సరాల స్వాతంత్ర్యాన్ని గ్రామ గ్రామన అద్భుత మహోత్సవాలు గా జరుపు కోవాలని ఇచ్చిన పిలుపుకు అనుగుణంగా చిప్పాడలోని దివీస్ కర్మాగారం లోపల సమీప గ్రామాలలో ప్రతిరోజు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తుంది అజాధీకా అమృత్ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం దివీస్ ఉద్యోగులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. దీనిని దివీస్ జనరల్ మేనేజర్ వైయస్ కోటేశ్వరరావు జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు ఇందులో 400 మంది ఉద్యోగులు తమ బైకులతో భారతదేశ జెండాలను ప్రదర్శిస్తూ దివిస్ ప్రధాన గేటు వరకు ర్యాలీ ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్ ఘర్ తరంగా కార్యక్రమం లో ప్రతి దివీస్ ఉద్యోగి తప్పని సరిగా పాల్గొంటారని ,దేశ సమగ్రతను దేశ సార్వభౌన్నత్యాన్ని కాపాడాలంటే ప్రతీ ఒక్కరూ బాధ్యత గల వ్యక్తిగా మసలు కోవాలని స్వా తంత్ర్య యోధుల జీవితాల నుండి పాఠా లను మనం తెలుసుకొని ఆచరించాలని అన్నారు. దివిస్ ఉద్యోగులు సామాజిక అంశాలపై స్పదించడం ప్రతీ సారి జరుగుతుందన్నారు. యాజమాన్యం సైతం అజాధీ కా అమృత్ కార్యా క్రమాన్ని పరిసర గ్రామాల్లో నిర్వహించటానికి ప్రో త్సాహం అందించదని అన్నారు. ఈ కార్యక్రమంలో

దివీస్ భద్రతా విభాగపు ఎ జీ ఎం చంద్ర శేఖర్ ,వెల్ఫేర్ ఆఫీసర్ ఎం విజయ భాస్కర్, సెక్యూరిటీ అధికారి ఆర్ గోవిందరావు దివీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో

# హర్ ఘర్ తిరంగా 5 వరోజు కార్యక్రమం



విశాఖపట్నం (విజయ భాను న్యూస్) : అజాది కా అమృత్ మహో త్సవ్ లో భాగమైన హర్ ఘర్ తిరంగా 5 వరోజు కార్య క్రమం స్థానిక రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ఘనంగా నిర్వ హించారు. ప్రధానోపాధ్యాయురాలు నాగ నళిని జాతీయజెండా ఎగురవేయగా వక్తగా విచ్చే సిన విశ్రాంత ఆర్మీ అధికారి నల్లా వెంకటరమణ మాట్లాడుతూ తాను ఇక్కడే ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని సైన్యంలో చేరి సేవలందిస్తూ చదువుని కొనసాగించానని, ఆర్మీ లో చేరాలనుకున్నవారికి అవసరమైన సలహాలకు ఇవ్వడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు.తదుపరి పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు మరియు ఎన్ సి సి అధికారి శ్రీ ఇండుగుల కృష్ణమోహన్ ఎన్ సి సి విద్యార్థులచే వివిధ రకాల పిరమిడ్ విన్యాసాలు చేయించగా 150 మంది విద్యార్థినీవిద్యార్థులు దేశభక్తి నినాదాలు చేస్తూ త్రివర్ణ బెలూన్లతో ర్యాలీలో పాల్గొన్నారు.

# 'గడప గడప'లో రాఖీ శోభ

# మంత్రి అమర్‌కు రాఖీ కట్టి స్వాగతించిన మహిళలు



అనకాపల్లి, విజయభాను న్యూస్ : అనకాపల్లి జిల్లా కొత్తూరులో శుక్ర వారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆద్యంతం రాఖీ పండుగ శోభను సంతరించుకుంది. వరుసగా రెండో రోజు "గడప గడపకు" మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు..ప్రతి గడపలోను మహిళలు అమర్నాథ్ కు రాఖీలు కట్టారు.. గ్రామంలో మురికి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రధాన కాలువ నిర్మాణం పూర్తయిన వెంటనే గ్రామంలోని కాలువలను పూర్తి స్థాయిలో మెరుగు పరుస్తామనీ అమర్ నాథ్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అని మంత్రి ప్రశ్నించారు.. అందుతున్నాయంటూ లబ్ధిదారులు బదులిచ్చారు..ఈ సందర్భంగా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ సంక్షేమ సంఘం సభ్యులు మంత్రి అమర్నాథ్ ని కలిశారు..సుమారు 450 మంది సభ్యులున్న తమ సంఘాన్ని 15 ఏళ్లు గా నడుపుతున్నామనీ, అయితే తమ సంఘానికి సొంత భవనం లేదని,కొత్తూరు పంచాయతీ కార్యాలయం ఎదుట వున్న స్థలంలో తాత్కాలిక భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని మంత్రి అమర్ ను కోరారు. ఈ విషయాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు... ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్ పర్సన్ బీశెట్టి వరాహ సత్యవతి, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి మండల కార్యదర్శి బిశెట్టి జగన్, కొత్తూరు సర్పంచ్ సప్పారపు లక్ష్మీ ప్రసన్న- వరహాలు, మురుగుతి శ్రీను, ఉప సర్పంచ్ అనపర్తి శ్రీనివాసరావు,ఎండిఓ చంద్రశేఖర్,వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు..

# సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : ఈ నెల 16 తేదీన అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన నేపథ్యంలో పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ , కలెక్టర్ రావి సుభాష్ , ఎమ్మెల్యే యు వి రమణమూర్తి రాజు ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు . సెజ్ లో గల ఏటిసి టైర్ల పరిశ్రమ ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్ మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ యు సుకుమార్ వర్మ , ఎంపీపీ కోన సంధ్య బుజ్జి , జడ్పిటిసి లాలం రాంబాబు , కో ఆప్షన్ జెడ్పిటిసి నర్మాల కుమార్ , వైసిపి మండల పార్టీ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు , సర్పంచులు కూండ్రపు విమలానాయుడు , చేపల సుహాసిని వెంకటరమణ , ఎంపీటీసీ లాలం శ్రీను, వైసీపీ నాయకులు తోట వెంకటేష్ , ఉమ్మిడి జగన్ , గంగూలీ శ్రీను , గంగిరి రవి , సూరడ ధనరాజు తదితరులు ఉన్నారు.

## వాడచీపురుపల్లిలో ర్యాలీ



పరవాడ: 75 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం75 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లో ప్రభుత్వం ఆదేశముల మేరకు వాడ చీపురుపల్లి పంచాయతీ లో ర్యాలీ నిర్వహించడం జరిగింది .ఈ ర్యాలీ లో సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, ఇళ్లపు రాము సిబ్బంది డ్వాక్రా మహిళలు స్థానిక వైసీపీ కన్వీనర్ తాతాజీ స్థానిక నాయకులు మరియు ప్రజలు తథితర్లు పాల్గొన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

### విజయ స్ఫూర్తి

బర్మింగ్‌హామ్ వేదికగా పన్నెండురోజుల పాటు అంగరంగ వైభవంగా సాగిన క్రీడా మహోత్సవానికి తెరపడింది. కోట్లాది మందిని మురిపించి, వేలాది మంది అథ్లెట్లను మెరిపించిన కామన్వెల్త్ క్రీడా సంరంభం సోమవారంతో పరిసమాప్తమైంది. తొలిరోజే రెండు స్వర్ణాలతో ఘనంగా బోణీ కొట్టిన ఆస్ట్రేలియా చివరిదాకా ఆధిపత్యాన్ని నిలబెట్టుకొని మొత్తం 178 పతకాలతో అగ్రస్థానం దక్కించుకుంది. వరుసగా రెండోసారి ఈ ఘనత దక్కించుకున్న ఆసీస్ ఈ క్రీడల్లో అగ్రపీఠాన నిలవడం ఇది పదమూడోసారి. ఒకప్పటి తమ పాలన లోని దేశాలు పాల్గొనే ఈ క్రీడల్లో ఇంగ్లండ్ 176 పతకాలతో ద్వితీయస్థానం సంపాదించుకుంది. 92 పతకాలతో కెనడా మూడోస్థానంలో, 215 మంది క్రీడాకారులతో వెళ్లిన భారత బృందం 61 పతకాలతో నాలుగో స్థానంలో నిలిచాయి. క్రితం సారి 66 పతకాలతో ఒకమెట్టుపైనే ఉన్న భారతదేశానికి ఈమారు ఐదు పతకాలు తగ్గాయి. స్వర్ణాల పరంగా గత క్రీడల్లో 26 దక్కితే, బర్మింగ్‌హామ్‌లో ఆ సంఖ్య 22కు పరిమితమైంది. మనకు గట్టి పట్టున్న షూటింగ్ క్రీడాంశానికి ఈసారి చోటు లేకపోవడం అవకాశాలను బాగా దెబ్బతీసింది. గత క్రీడల్లో మన షూటర్లు ఏకంగా 16 పతకాలు కొల్లగొట్టిన విషయం తెలిసిందే. ఇక, కచ్చితంగా స్వర్ణం గెలుస్తాడనుకున్న ఒలింపిక్ విజేత, జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా గాయంతో క్రీడల ఆరంభానికి ముందు తప్పుకున్నాడు. ఇలాంటి ప్రతికూల పరిణామాల మధ్య బర్మింగ్‌హామ్‌కు పయనమైన మన జట్టు తొలి ఐదు స్థానాల్లో నిలవడమే లక్ష్యం అని చెప్పి, ఆ మాటను నిలబెట్టుకుంది. ఇన్నేళ్ల కామన్వెల్త్ చరిత్రలో భారత్‌కు అత్యధిక పతకాలు తెచ్చి పెట్టినవి రెజ్లింగ్, షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్ లాంటి సంప్రదాయ క్రీడాంశాలే. ఈ ఆనవాయితీని కొనసాగిస్తూ ఈమారు మన కుస్తీ యోధులు అత్యధికంగా ఆరు స్వర్ణాలు సహా పన్నెండు పతకాలను పట్టుకురాగా.. మూడు స్వర్ణాలు కలిపి పది పతకాలను లిఫ్టర్లు సాధించారు. ఆ తర్వాత అథ్లెటిక్స్‌లో ఎనిమిది పతకాలు రావడం శుభ పరిణామం. 1958లో ఫ్లయింగ్ సిఖ్ మిల్కా సింగ్ స్వర్ణం సాధించాక కొన్ని దశాబ్దాల పాటు అథ్లెటిక్స్‌లో పతకాలే రాని దురవస్థ ఉండేది. కానీ, 2010లో ఢిల్లీ ఆతిథ్యమిచ్చిన కామన్వెల్త్ క్రీడల నుంచి ఈ పరిస్థితిలో మార్పు వస్తోంది. అంతకంతకూ మెరుగవుతూ అథ్లెట్లు కామన్వెల్త్ క్రీడల్లో విశేషంగా రాణిస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు. ట్రిపుల్ జంప్‌లో ఎల్డోస్ పాల్, అబ్దుల్లా, మహిళల జావెలిన్ త్రోలో అన్నూరాణి, పదివేల మీటర్ల నడకలో ప్రియాంక, లాంగ్ డిస్టెన్స్ విభాగంలో అవినాష్ దేశానికి తొలిసారి పతకాలు అందించి చరిత్ర సృష్టించారు. మహిళల లాన్ బౌల్స్‌లో స్వర్ణం గెలిచిన జట్టులోని సభ్యులైన లవ్‌లీ, పింకీ, రూప, నయన్మోని.. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటూ క్రీడలకు సన్నద్ధమై ఫలితాన్ని రాబట్టిన తీరు సర్వత్రా ప్రశంసనీయం. వృత్తులు, నేపథ్యాలు, ప్రాంతాలు వేరైనా ఆటకోసం ఒక్కటిగా కలిసి జట్టును విజేతగా నిలిచిన ఈ నలుగురి కథనం ఎందరికో స్ఫూర్తిదాయకం. మనకు అంతగా పరిచయం లేని లాన్ బౌల్స్‌లాంటి ఈవెంట్లలోనూ పతకాలు దక్కడం విశేషం.

ఈసారి క్రీడల్లో తెలుగు తేజాలు తమ ప్రతిభా పాటవాలను చాటుకున్నారు. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్, కిడాంబి శ్రీకాంత్, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్, హుస్సాముద్దీన్, టేబుల్ టెన్నిస్‌లో ఆకుల శ్రీజ పతకాలు అందుకొని అభిమానులను విశేషంగా అలరించారు. తన శిక్షణ కోసం మూడేళ్లపాటు ఉద్యోగం మానేసిన తండ్రి పోరాటం వృథా కానీయకుండా బాక్సర్ నీతూ బంగారు పతకాన్ని ముద్దాడడం, తండ్రితో పాటు కిళ్లీ కొట్టులో పనిచేస్తూనే శిక్షణకు సన్నద్ధమైన లిఫ్టర్ సంకేత్ సర్గార్ రజత పతకాన్ని అందుకోవడం.. ఇలా విభిన్న నేపథ్యాలున్న క్రీడాకారులు కామన్వెల్త్‌లో సాధించిన విజయాలు దేశవాసులను అబ్బుర పరిచాయి. బర్మింగ్‌హమ్‌లో మనవారి ప్రదర్శన కొంత సంతోషాన్ని ఇస్తున్నా అసలు సవాల్ వచ్చే ఏడాది చైనాలో జరిగే ఆసియా క్రీడల్లో ఎదురుకానుంది. కామన్వెల్త్‌తో పోలిస్తే అక్కడ ప్రమాణాలు, అథ్లెట్ల మధ్య పోటీ ఎక్కువ. అందువల్ల, కామన్వెల్త్‌లో చేసిన తప్పులను సమీక్షించుకొని, ఆసియాడ్‌కు మరింత సమర్థవంతంగా సన్నద్ధమవ్వాలి.

# వారిజ ఆశ్రమంలో దేవనాథ సమక్షంలో ఉపాకర్మ పూర్తి, వేద విద్య మొదలు

*- జీయర్ స్వామి రామాయణం, శ్రీకాంత్ స్వామి ఋగ్వేద పాఠం ప్రారంభం*




భీమునిపట్నం (విజయభాను న్యూస్) : విశాఖపట్నం - భీమిలి బీచ్ రోడ్ లోని వారిజ ఆశ్రమం ( విశాఖపట్నం నుంచి భీమిలి బీచ్ రోడ్ లో గల చిన్న జీయర్ స్వామి వారి వేద పాఠశాల ) లో పరమహంస పరివ్రాజకులు త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి సమక్షంలో బ్రహ్మచారులకు ఉపాకర్మ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుఝామునే 4 గంటల నుంచి కామో కార్షీ మంత్ర జపం 1008 సార్లు చేయించడంతో ఉపాకర్మ ప్రక్రియ మొదలుఅయ్యింది. అనంతరం విద్యార్థులు, గాయత్రీ మంత్రం జపం చేయడం, ఋషి తర్పణాలు, దేవా తర్పణాలు మంత్రం పూర్వకంగా జరిపించారు. తదుపరి ఓపనం, సంధ్యావందనం, గురుపరంపర, హోమం లో హవనం, తదుపరి పూర్ణాహుతి ప్రక్రియ చేయడం ద్వారా ఉపాకర్మ క్రియ నిర్వహించారు. ఈ విద్యార్థులందరికీ పూర్ణాహుతి అనంతరం, త్రిదండి దేవనాథ జీయర్ స్వామి ఉపాకర్మ వైశిష్ట్యం, జరుపుకోడానికి గల కారణాలు, ఫలితం వివరించారు. వేదవిద్యను సంవత్సరం లో కేవలం 6 నెలలు మాత్రమే నేర్పించడం జరుగుతుందని, మిగిలిన ఆరు నెలలు నేర్చుకున్న విద్యను మననం చేసుకోవాలన్నారు. శ్రావణ పౌర్ణమి నాడు వేదవిద్య ను నేర్పించడం జరుగుతుందన్నారు. మాఘ మాసం లో ముగుస్తుందని, తదుపరి ఆరు నెలలు ఈ నేర్చుకున్న విద్యను మననం చేసుకోవాలన్నారు. తమ ఆచార్యులు అపర రామానుజులు త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి సూచనల మేరకు వారిజ ఆశ్రమంలో ఉపాకర్మ ను ఆచరిస్తున్నామని, వేదవిద్యార్థులతో పాటు, లౌకిక విద్యను అభ్యసిస్తున్న బ్రహ్మచారులతో కూడా ఉపాకర్మ విద్యానాన్ని ఆచరింప చేస్తున్నామన్నారు. వారికి ఉన్నత భవిష్యత్ లభించాలని ఆచార్యులు మంగళాశాసనం చేశారన్నారు. తదుపరి జీయర్ స్వామి విద్యార్థులందరికీ శ్రీరామాయణం లోని మొదటి శ్లోకాలను నేర్పించారు. వారిజ ఆశ్రమంలోని ఋగ్వేద అధ్యాపకులు ముడుంబై శ్రీకాంత్ స్వామి ఋగ్వేదం లోని అగ్నిమీళే. . .శ్లోకంతో తొలి పాఠాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమం లో వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 30 మంది బ్రహ్మచారులు (వేద విద్యార్థులతో పటు, injaneering విద్యార్థులు కూడా) పాల్గొని అత్యంత శ్రద్ధగా ఉపాకర్మ ప్రక్రియను ఆచరించారు.

వైభవంగా సాగుతున్న శ్రీ లక్ష్మి యాగం విశాఖ లో చాతుర్మాస్య దీక్ష నిర్వహిస్తున్న త్రిదండి దేవనాథ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో వారిజ ఆశ్రమం లో శ్రావణ మాసం లో భాగంగా ఈ నెల 29 నుంచి జరుగుతున్నా శ్రీ లక్ష్మి యాగం లో నిత్య పూర్ణాహుతి వైభవంగా జరిగింది.

దేశ అభివృద్ధి కోసం, లోక కళ్యాణం కోసం మూల మంత్రం హవనం, శ్రీ సూక్త హోమం, భక్తుల విద్య, వ్యాపార, తదితర రంగాల్లో అభ్యున్నతి కోసం నక్షత్ర హోమాలను, వారిజ ఆశ్రమం వేదం పండితులచే నిర్వహిస్తున్నట్టు తెలియచేసారు. ఈ యాగ కార్యక్రమాలను దేవనాథ జీయర్ స్వామి వివరించారు.

# అప్రాణో హ్యమనాః శుభ్రో హ్యక్షరాత్ పరతః పరః?

## ముండకోపనిషత్ 2-1-2



ఆత్మ అప్రాణుడు, అమనస్కుడు, శుభ్రుడు మరియు పరమమైన అక్షరము కంటెనూ పరమమైనవాడు.

ఉపనిషత్ ప్రతిపాద్యుడైన ఆత్మ లోపలా బయటా నిండుకొని వుంటాడు. ఆత్మ అప్రాణుడు అంటే ప్రాణ సంబంధము లేనివాడు. ఆత్మ నుండి ప్రాణము పుట్టుట వలన ఆత్మకు ప్రాణముయొక్క పొత్తు వుండదు. ప్రాణము వున్ననూ పోయిననూ ఆత్మకు దానివలన ఏమియూ అవదు ఆత్మ అమనసుడు, అంటే మనస్సు యొక్క సంబంధము లేనివాడు. ఆత్మనుండే మనస్సు పుట్టివున్నది. ఆత్మనుండే మనస్సుకు అస్తిత్వము. మనస్సుకూ సాక్షియైనట్టి ఆత్మకు మనస్సు యొక్క పొత్తు వుండదు. మనస్సూ ప్రాణమూ అనాత్మలే. ఆత్మ శుభ్రుడు, అంటే పుణ్యపాపముల యొక్క సంబంధములేనివాడు. ఆత్మకు త్రిగుణములయొక్క సంబంధముగానీ, దేశకాలములయొక్క సంబంధముగానీ లేనందువలన ఆత్మ నిత్యశుద్ధుడు. ఆత్మ అవ్యాకృతముకంటెనూ సూక్ష్మడై వుంటాడు. సాంఖ్యదర్శనములోని ప్రధానమూ సూక్ష్మమూ పరమమూ అయ్యుండును. అయితే వేదాంతమందు ప్రధానముకంటెనూ సూక్ష్మమైనది ఆత్మతత్త్వము. దీనిని తానే అని తెలుసుకొనుటయే ఆత్మ జ్ఞానము. ఇదే వేదాంత వైశిష్ట్యము.

?ఓం శాంతిః శాంతిః శాంతిః?

## కవి సమయం

### గగన కుసుమం

సాక్షిగా వస్తాను
ఈ భువనం నుండి గగనానికి
సామాన్యుడి బతుకుని
కన్నీటి నదిలో
కష్టాల నావపై
పయనింప చేస్తున్న
రాజకీయ నాయకుల చరిత్రలను
వివరించడానికి
సాక్షిగా వస్తాను
విద్య వినయములకు
స్వస్తి చెప్పి
తప్పుదోవ పడుతూ
మత్తు గమ్మత్తులకు
చిత్తు చిత్తుగా
బానిసలవుతున్న
యువతీయువకుల
విలాసాలను
విశదీకరించడానికి
సాక్షిగా వస్తాను..

...కవితా రచన
ఆకాసం సత్యప్రకాష్

# పంచాంగం

మాసం : శ్రావణ; తిథి :విదియ తె.3.29; శతభిషం తె.3.00; ఉ.వ.10.59ల 12.31.

శనివారం 13-08-2022

a **మేషం** : బ్యాంకు వ్యవహారాలు, ప్రయాణాల్లో మెలకువ వహించండి. ఎదుటివారితో సంభాషించేటపుడు మెలకువ వహించండి. రాజకీయనాయకుల కదలికలపై విద్రోహులు కన్నేసిన విషయం గమనించండి.

b **వృషభం** : విద్యార్థులకు పోటీ పరీక్షల ఏకాగ్రత, సమయపాలన అవసరం. ఖాదీ, పట్టు, చేనేత, కలంకారీ వస్త్ర వ్యాపారులకు ఆటుపోట్లు తప్పవు. ఉపాధ్యాయులకు ఒత్తిడి, చికాకులు అధికమవుతాయి. స్త్రీలు ఇతరులతో మితంగా సంభాషించటం క్షేమదాయకం. ఉద్యోగస్తులకు అధికారుల నుండి ఒత్తిడి, పనిభారం అధికమవుతాయి.

c **మిథునం** : వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. ఏ విషయంలోను ఇతరులపై ఆధారపడక స్వయం కృషినే నమ్ముకోవడం మంచిది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బ్యాంకు వ్యవహారాలలో పరి చయం లేని వ్యక్తులతో మితంగా సంభాషించండి.

d **కర్కాటకం** : మీ సంతానం పరీక్షల పట్ల శ్రద్ధ వహిస్తారు. ఆడిటర్లకు ఒత్తిడి, కాంట్రాక్టర్లకు లాభదాయకం. ఏ విషయంలోను నిరుత్సాహం చెందక అంతా మంచికేనని సర్దుకుపోవటం శ్రేయస్కరం. ఎల్.ఐ.సి పోస్టల్ ఏజెంట్లకు ఒత్తిడి, స్పెక్యులేషన్ రంగాల వారికి చికాకులు తప్పవు. బంధువుల మధ్య సయోధ్య నెలకొంటుంది.

e **సింహం** : విద్యార్థులకు ఏకాగ్రత వల్ల అభివృద్ధి పొందగలుగుతారు. కొత్త సమస్యలు తలెత్తె అవకాశం ఉంది. మెళుకువ వహించండి. మీ మాటకు సంఘంలోనూ, కుటుంబములోనూ ఆమోదం లభిస్తుంది. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదని గమనించండి. డాక్టర్లు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తిచేస్తారు.

f **కన్య** : స్త్రీలతో సంభాషించునపుడు సంయమనం పాటించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు ఏకాగ్రత ముఖ్యం. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. స్టాక్ మార్కెట్ రంగాల వారి అంచనాలు తలకిందులవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు

g **తుల** : కాంట్రాక్టర్లకు రావలసిన ధనం అందడంతో నిర్మాణ పనులు వేగవంతమవుతాయి. ఎదుటివారితో ఎలా మాట్లాడినా తప్పుగానే భావిస్తారు. విద్యార్థులకు చదువుతో పాటు ఇతర్రతా ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇతరులకు వాహనం ఇచ్చేటపుడు లౌక్యం పాటించండి. దైవ, పుణ్య కార్యాక్రమాల పట్ల చురుకుగా పాల్గొంటారు.

h **వృశ్చికం** : ఎదుటివారి విషయాలలో జోక్యం చేసుకోవటం వల్ల మాటపడక తప్పదు. స్త్రీలు గత కొంత కాలంగా అనుభవిస్తున్న సమస్యలు పరిష్కారం కాగలవు. పచారీ, ఫ్యాన్సీ, హోటల్, తినుబండారాలు, క్యాటరింగ్ పనివారలకు పురోభివృద్ధి. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళకు లొంగకుండా స్థిరచిత్తంతో వ్యవహరించవలసి ఉంటుంది.

i **ధనుస్సు** : ప్రేమికులకు పెద్దల నుండి వ్యతిరేకత, ఇతర్రతా చికాకులు అధికమవుతాయి. కొంతమంది మీ నుండి ధనసహాయం ఆశించవచ్చు. వైద్యులకు చురుకు ధనం, ఆడిటర్లకు ఒత్తిడి, లాయర్లకు కలిసివచ్చే కాలం. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేస్తారు. గృహంలో మార్పులు, చేర్పులకై చేయు యత్నాలు ఫలిస్తాయి.


j **మకరం** : ఉపాధ్యాయులకు ఒత్తిడి, అక్కౌంట్స్ రంగాల వారికి పనిభారం తప్పవు. స్త్రీలకు శ్రమాధిక్యత, మానసికాందోళనల వల్ల ఆరోగ్యము మందగిస్తుంది. చిన్నతరహా, కుటీర పరిశ్రమల వారికి ప్రోత్సాహకరం. చిరు వ్యాపారులకు చికాకులు తప్పవు. బంధువుల రాకపోకలు అధికమవుతాయి. ప్రముఖులను కలుసుకుంటారు. k **కుంభం** : స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధికమవుతాయి. ఉద్యోగస్తుల తొందరపాటు చర్యలు, నిర్లక్ష్యం వల్ల కొత్త సమస్యలెదుర్కోవలసి వస్తుంది. పత్రిక రంగాల్లో వారు, రచయితలు ఆశించే మర్పులకోసం కొంత కాలం వేచియుండక తప్పదు.

L **మీనం** : దంపతుల మధ్య సఖ్యత నెలకొంటుంది. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు పోకుండా ఏకాగ్రతతో పని చేయవలసి ఉంటుంది. స్త్రీలకు ముఖ్యుల నుంచి ఆహ్వానాలు అందుకుంటారు. అయినవారితో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఉపాధి పథకాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఆలయాలను సందర్శిస్తారు.

# శ్రీరామచంద్రుడు.. సాక్షాత్తు దేవుడే!

## సంకీర్తన

రాముడు చెడ్డవాడంటూ ఇటీవల కాలంలో కొందరు కొన్ని వితండవాదాలు లేవదీస్తున్నారు. రాముడే కాదు లక్ష్మణుడూ అలాంటివాడేనని కూడా దబాయిస్తున్నారు. రాముడు మంచివాడైతే సీతాదేవిని అడవులెకందుకు పంపించాడని ప్రశ్నకూడా వేస్తున్నారు. వాటన్నిటికీ సమాధానమే ఈ ప్రయత్నం. వాల్మీకిని రామాయణం రాయమని ప్రోత్సహించడానికి వస్తాడు నారదుడు. పంపా తీరంలోని వనంలో హనుమంతుడినిచూసి, ఆయన మాటపై గౌరవంవుంచి, సుగ్రీవుడితో స్నేహంచేసాడు రాముడు. తనకథ, సీతవృత్తాంతం మొత్తం ఆయనకు చెప్పాడు. చెప్పిన తర్వాత, సుగ్రీవుడు రాముడితో అగ్ని సాక్షిగా స్నేహితులయ్యారు. రాముడు వానరుడితో స్నేహం చేశాడంటే అది అతడి సౌశీల్యాతిశయం గురించి చెప్పడమే. గుహుడు హీనజాతివాడైనా, పురుషుడైనందున అతనితో స్నేహం చేసినందువల్ల రాముడి సౌశీల్యం చెప్పడం జరిగింది. హీన స్త్రీ అయిన శబరితో స్నేహం చేయడంవల్ల రాముడు మిక్కిలి సౌశీల్యవంతుడయ్యాడు. వానరుడైన సుగ్రీవుడితో స్నేహమంటే మీదుమిక్కిలి సౌశీల్యం చూపడం జరిగింది. శ్రీరామచంద్రుడు ప్రశస్తమైన ధర్మజ్ఞానం గలవాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పనివాడు. దానధర్మాలు, స్వాశ్రీతరక్షణ వల్ల లభించినయశస్సు, శత్రువులను అణచినందున వచ్చిన కీర్తి గలవాడు. సర్వజ్ఞుడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. ఆత్మతత్వం ఎరిగినవాడు. విష్ణువుతో సమానుడు. లోకాలను పాలించ సమర్థుడు. ప్రాణికోటిని రక్షించాలన్న కోరికున్నవాడు. ధర్మాన్ని తానాచరిస్తూ, ఇతరులతో ఆచరింపచేసేవాడు. అలా వచ్చిన నారదుడిని, గుణవంతుడు, అతివీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచార సంపన్నుడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరి కున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శ నుడు, ఆత్మ వంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్నవాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో? అని పదహారు ప్రశ్నలు వేస్తాడు వాల్మీకి. నారదుడు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్తాడు. బాల్యంలోనే శ్రీరాముడు గుహుడు లాంటి (నీచ) జాతి వారితో సహవాసం చేయడంతో, ఆయన గుణ వంతుడు అయ్యాడు. తాటకాది రాక్షసులను చంపి వీర్యవంతుడు అయ్యాడు. గురువాజ్ఞ మీరక పోవడం-జనకాజ్ఞ జవదాటక పోవడం-పరశు రాముడిని చంపక పోవడం లాంటివి ఆయన ధర్మజ్ఞుడు అని తెలుపుతాయి. అయోధ్య కాండ వృత్తాంతమంతా శ్రీరాముడిని సత్యవాది గా-దృఢవ్రతుడిగా -సచ్చరిత్రుడుగా తెలుపుతుంది. విభీషణ శర ణాగతి ద్వారా రాముడి ఆత్మవంతుడి లక్షణాన్ని బయటపెడుతుంది. ఇంద్రజిత్తుపై కోపించక పోవడం, చేజిక్కిన రావణుడిని విడిచిపెట్టడం, రాముడి జితక్రోధత్వాన్ని తెలుపుతుంది. విరోధైన రావణుడిని మెచ్చు కోవడమంటే రాముడికి అసూయలేదనే కదా. ఇలానే రాముడు కాంతియుక్తుడనీ- భయం కరుడనీ పలు సందర్భాల్లో అర్థమవుతుంది. వాల్మీకి శ్లాఘించిన గుణాలు అసమానమైనవి. ఒక్కో గుణంలో అంతర్లీనంగా ఇంకొన్ని వుండడంతో అవి అనేకమయ్యాయి. మనుష్యమాత్రులందు ఇవి కనపడవు. ఇట్టి సుగుణ సంపత్తికలవాడు, ఇక్ష్వాకుల మహారాజు వంశంలో, రామా రామా రామా, అని లోకులు పొగిడే రామచంద్రమూర్తి అనే పేరుగలాయన మాత్రమే. అతివీర్యవంతుడాయన. అసమాన మైన-వివిధమైన-విచిత్రమైన శక్తిగలవాడు. సర్వం తెలిసినవాడు. నీతే ప్రధానం ఆయనకు. పరులకు హితమైన, ప్రియమైన మాటలు చెప్తాడు. శ్రీమంతుడు. ఎవరిపై శత్రు భావం లేకపోయినా, తనను ఆశ్రయించిన వారిని ద్వేషిస్తే, వారిని నాశనం చేసే వాడు. ఎత్తైన మూపురాలున్నవాడు.



# టీడీపీ రాష్ట్ర మహిళ అధ్యక్షురాలును కలిసిన పైలా



పరవాడ(విజయభాను న్యూస్) : తెలుగుదేశం పార్టి రాష్ట్ర మహిళా అధ్యక్ష రాలును వివాహ మహెూత్సవ కార్యక్రమంలో పరవాడ గ్రామ టిడిపి అధ్యక్షులు పైల సన్యాశి నాయుడు పుష్పగుచ్ఛం అంద జేసి మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరము స్థానికంగా పరవాడలో గల పలు సమస్యలు పై చర్చించారు.

# రాఖీ పండుగ రోజు సాహితీ విన్నూత్న ప్రచారం



గాజువాక (విజయభాను న్యూస్): రాఖీ పండుగ రోజు అన్నదమ్ములు సంతోషంగా ఉండాలని కోరుకుంటూనే పర్యావరణం కూడా కాపాడాలనే ఆలోచనతో ముఖ్యంగా ప్లాస్టిక్ వల్ల సమాజానికి ఎంతో నష్టం వాటిల్లుతుందని ఇటువంటి భయంకరమైన ప్లాస్టిక్ ని వాడకుండా ఉండడం కోసం విజ్ఞాన్ హైస్కూల్ బిసి రోడ్ ఐదో తరగతి చదువుతున్న జేడి ఫౌండేషన్ సభ్యురాలు చిన్నారి గొంప సాహితీ విన్నూత్న ప్రచారం చేసి అందర్నీ ఆకట్టుకుంది. అన్నదమ్ము లకి రాఖీ కట్టే సందర్భంలో అన్నదమ్ములు ఇచ్చే బహుమతులకు బదులు ఇక మీదట ప్లాస్టిక్ వాడనని వారి వద్ద మాట తీసుకోవడమే కాక ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు వారికి వివరించింది. ఈ వినూత్న ప్రచారానికి నడుబిగించిన చిన్నారి సాహితికు పలువురు అభినందనలు తెలిపారు.

# అధ్వానంగా బాలికల వసతి గృహాలు

## కార్పొరేటర్ గంటా అప్పలకొండ

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : పభుత్వం ఏర్పాటు చేసిన వసతి గృహాలమీద నమ్మకంతో తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టల్లో చేర్పిస్తే అధికారుల నిర్లక్ష్యం కారణంగా బాలికలు నరకం చూస్తున్నారని జీవిఎంసీ భీమిలి జోన్ 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ అధికారుల తీరుపై మండిపడ్డారు. భీమిలి జోన్ 3వ వార్డులో ఉన్న సమీకృత సంక్షేమ బాలికల వసతి గృహాన్ని టి డి పి రాష్ట్ర కార్యదర్శి, గంటా నూకరాజుతో కలసి ఆమె శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసి విస్తుపోయారు. 10వ తరగతి వరకు చదువుకొనే అమ్మాయిలు 150 మంది ఉన్న వసతి గృహం ఇలా ఉంటుందా. అని కుమిలిపోయారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా కూడా ఇంత అద్వాణ్ణంగా మౌలిక సౌకర్యాలు ఉన్నాయంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుందని కార్పొరేటర్ గంటా అప్పలకొండ అన్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా విద్యకు సంబంధించి వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతుందని కానీ నేడు ఈ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన తరువాత ప్రభుత్వం తప్పుడు సమాచారం ఇస్తుందలేక అధికారుల నిర్లక్ష్యం ఎక్కువగా ఉందా. అనే అనుమానం వస్తుందని అన్నారు. ఇక్కడ ఉన్న బాలికల బాధలు చూస్తుంటే మహిళా కార్పొరేటర్ గా నాకే సిగ్గేస్తుందని అన్నారు.

ఇప్పటికైనా అధికారులు రెండు వారా ల్లోగా సమీకృత సంక్షేమ బాలికల వసతి గృహాల మౌలిక వసతుల్లో మార్పులు రావాలని గంటా అప్పలకొండ హెచ్చరించారు.

# గ్రామీణాభివృద్ధే ముఖ్యమంత్రి జగనన్న ధ్యేయం

- గడప గడపకు డిప్యూటీ సీఎం 'బూడి' పలకరింపు
- సమస్యలు వింటూ... పరిష్కారం దిశగా అడుగులు
- గ్రామాల్లో జోరుగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు



దేవరాపల్లి,(విజయభాను న్యూస్) : గ్రామీణాభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలో జోరుగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని రైవాడ పంచాయతీ శివారు శ్రీరాంపురం, శంభువానిపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. అంతకుముందు గ్రామంలో సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని గడపగడపకు పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకుని వాటికి పరిష్కారం దిశగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాల విద్యార్థులతో కొంతసేపు ముచ్చటిస్తూ పోషకాహారంతో పాటు అమ్మఒడి, బూట్లు, యూని ఫారం, పుస్తకాలు ఎవరు ఇస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి అడిగిన ప్రశ్నకు జగన్ మామ ఇస్తున్నారు అని పిల్లలు చెప్పడంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మిమ్మల్ని ఇంకా జగన్ మామ ఉన్నత స్థాయి చదువులు చది విస్తాడని అందరూ హాయిగా ఆనందంగా ఉండాలని ఆశీర్వదించారు. రాఖీ పండుగను పురస్కరించు కుని ఆడపడుచులు అడుగడుగునా హారతులు పట్టి, రాఖీలు కట్టారు. గ్రామాల్లో జరిగే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తుంది.ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పిటిసి కర్రి సత్యం,వైస్ ఎంపీపీ ఊర్రోకుల గంగా భవాని అప్పారావు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో సి.హెచ్ సుబ్బలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి సి.హెచ్ రవీంద్రబాబు, వ్యవసాయ అధికారి కాంతమ్మ, ఎస్ ఐ పి. సింహాచలం, కే కోటపాడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి వి. మంగతాయారు, రైవాడ సర్పంచ్ చల్లా లక్ష్మి , మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అవుగడ్డ రామమూర్తి నాయుడు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, కె. వి రమణ, స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లా తాతయ్యలు, కె .ఎస్.అప్పల నాయుడు, చల్లా నాయుడు, కూండ్రపు సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర మెట్ట వద్ద బోర్ వెల్ ప్రారంభం

భీమునిపట్నం : విజయభాను న్యూస్ : జీ వి ఎం సీ భీమిలీ జోన్ 1వ వార్డ్ తగరపువలస వెంకటేశ్వర మెట్ట వద్ద బోర్ వెల్ ను వైకాపా సీనియర్ నాయకులు అక్కరమాని రామునాయుడు, ప్రచార కమిటీ అధ్యక్షుడు తమ్మిన అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలే 1వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు పాల్గొన్నప్పుడు కార్పొరేటర్ అక్కరమాని పద్మావతి నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో వార్డ్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ వివరించగా వెంటనే ఎమ్మెల్యే స్పందించి తక్షణమే నిధులు మంజూరు చేయించారనీ చెప్పారు.ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి వెంపాడ వెంకట రమణ,జగుపిల్ల శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుకు రాఖీలు కట్టిన బ్రహ్మ కుమారీలు

కాకినాడ : రక్షాబంధన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకినాడలో ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జర్నలిస్టులకు బ్రహ్మకుమారీ కాకినాడ శాఖ, ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అంతేకాక పండుగ ప్రాచుర్యాన్ని వివరించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు బ్రహ్మ కుమారీలు చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ అందుబాటులో ఉన్న జర్నలిస్టులకు రక్షాబంధన్ గురించి వివరించి రాఖీలు కట్టారు. నుదుటున బొట్టు, చేతికి రాఖీ విశిష్టతలను తెలుపుతూ వారి దగ్గర ఉన్న విలువైన సమాచార గ్రంథాలను కానుకగా బహుకరించారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై స్పందిస్తున్న జర్నలిస్టులకు ఎల్లవేళలా మేలు జరగాలంటూ వారు భగవంతుడిని కోరారు.

ఈ కార్యక్రమంలో బ్రహ్మ కుమారీలు సి చంద్రావతి , ఎన్ కుమారి, బి అచ్చయ్యమ్మ, ఎం సత్తిబాబు, సిహెచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పిఎం కిసాన్ ఈకెవైసీ ప్రతి ఒక్కరైతు తప్పనిసరిగా చేయించుకోవాలి



భీమునిపట్నం (విజయభాను న్యూస్): : భీమిలి మండల కార్యాలయం లో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి భీమునిపట్నం మండల పరిషత్ అధ్యక్షులు డి.వి.ఎస్.ఎస్. ఎన్.రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ మొదలైనందున రైతులు వ్యవసాయ శాఖ సూచనల మేరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు కొత్త వ్యవసాయ పరికరాలు ద్వారా అధిక దిగుబడి పొందే విధంగా కృషి చేయాలి అని కోరారు. భీమిలి సహాయ వ్యవసాయ సంచాలకులు బి విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ పి ఎం కిసాన్ ఈ కె వై సీ ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. అలాగే రైతు భరోసా మెగ్ జైన్స్ గురించి వివరించారు దానికి గాను సంవత్సరానికి చందా మూడు వందల తెలియచేశారు. పై సూచనలను సభ్యులు పాటిస్తూ గ్రామము లో మిగతా రైతులకి కూడా తెలియపరచాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా భీమునిపట్నం మండల వ్యవసాయ అధికారిని బి.శివ కోమలి మాట్లాడుతూ పంట నమోదు యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ వ్యవసాయ శాఖ మరియు రెవెన్యూ శాఖ వారు కలిసి పంట నమోదు చేస్తారని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా వెటనరీ డాక్టర్ ఆర్ బి కె ద్వారా పశువుల దాణా మరియు గడ్డి విత్తనాలు అందుబాటులో ఉంటాయి అని తెలియచేశారు .అదే విధంగా ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

# అవంతి కళాశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవాలు

## 100 మీటర్ల త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ





మాకవరపాలెం (విజయభాను న్యూస్) : భారతదేశానికి స్వాతంత్రం లభించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా అవంతి ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం 100 మీటర్ల త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మోహన్‌రావురాచపల్లి కూడలిలో ర్యాలీని జాతీయ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో 1000 మంది అవంతి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, తామరం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు హాజరయ్యారు. భారత్ మాతాకుజై, మేరాభారత్ మహన్, జైజవాన్, జై కిసాన్ అను నినాదాలతో హోరెత్తించారు. తామరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థిని విద్యార్థులు త్రిపర్ణ పతాకంతో మానవహారాన్ని నిర్వహించారు. ఎంతో మంది ప్రాణత్యాగాల ద్వారా మనకు ఈ స్వాతంత్రం సిద్ధించిందని, మనం అభివృద్ధి చెందటం ద్వారా దేశాభివృద్ధి జరుగుతుందని అను నమ్మి స్వాతంత్ర సమరయోధులను స్మరించుకుంటూ మాకవరపాలెం తహశీల్దార్ కార్యాలయం వరకు కొనసాగించి జనగణమన గీతా లాపంతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఇ, ఇసిఇ, మెకానికల్, ఇఇఇ, ఎంబిఎ, విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు బి.గణేష్, గోపి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.ప్రసాదరావు, పిడి శివ, ఎఒ డానియల్‌రాజు పాల్గొన్నారు.

# ఘనంగా పలకా యశోధ జన్మదిన వేడుకలు



అనకాపల్లి విజయభాను న్యూస్ : వ్యవసాయ మార్కెట్ కమిటీ, అనకాపల్లి అధ్యక్షురాలు పలకా యశోద రవి జన్మదినోత్సవం కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు మెంబర్లు, హమాలీలు, వేయిటింగ్ మెన్స్, కొలగాలు, వర్తకులు, మార్కెట్ సిబ్బంది సమక్షంలో మార్కెట్ యార్డ్ అనకాపల్లిలో అట్టహాసంగా నిర్వహించారు. అధ్యక్షులు అధ్యక్షులకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు. మార్కెట్ యార్డ్ నందు 75వ అజాదిక అమృత మహెూత్సవం నిర్వహించారు. సుమారు పది మొక్కలను మార్కెట్ యార్డ్ ప్రధాన కార్యాలయము నందు 10 మొక్కలను నాటియుండిరి,100 వందమంది పేదలకు చీరలు పంపిణీ చేశారు, అధ్యక్షురాలు పలక యశోద రవి మాట్లాడుతూ అందరకు శ్రావణ పౌర్ణమి మరియు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలందరూ సస్యశామలంగా, ఆయురారోగ్యాలు ఆమె కోరారు, అప్పుడు ఈ కార్యక్రమంలో. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, ఉపాధ్యక్షులు. కరక సోము నాయుడు. డైరెక్టర్లు. నీటి పల్లి లక్ష్మి, మర్రిపల్లి శోభ, బొబ్బిలి శ్యామల, ఈగల నూక రత్నం. దాడి తులసి కుమారి. బొడ్డు అచ్చిరాజు, పిట్ట అప్పలరాజు. తెరపల్లి నాగ సంతోష్ కుమార్, దాడి కుమార్ వరాహ కృష్ణ, ఒమ్మి మోది బాబు, కొణతాల విజయ్ కుమారి, గుండా రమేష్ గుప్తా, గొంతుల శివ, కార్యదర్శి డి శకుంతల, సిబ్బంది, వర్తకులు, హమాలీలు, కొలగార్లు తదిరులు పాల్గొన్నారు.

# సంతోషిమాత అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు





అనకాపల్లి విజయభాను న్యూస్ : శ్రావణమాసం 3వ శుక్రవారం సందర్భంగా స్థానిక గవరపాలెం సంతోషిమాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గాజులతో ప్రత్యేకంగా అలంకరణ చేసారు. ఈసందర్భంగా ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పలకా యశోధ, రవి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వీరికి నిర్వాహకులు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీ సత్యవతి, మాజీ మంత్రి వర్యులు దాడి వీరభద్రరావు కి రక్షబందన్ కట్టి ఆశీర్వాదం తీసకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద ఆద్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. ఈకార్యక్రమంలో పెతకంశెట్టి శ్రీనివాసరావు, విల్లూరి ప్రసాద్, పిఎస్‌కే నాయుడు, పెతకంశెట్టి గోపీ, కొణతాల గోవింద్, దాడి వాసు, దాడి బుజ్జి, దాడి నూకఅప్పారావు, తదితరులు పాల్గొన్నారు.




దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ నేషనల్ చైర్మన్ బి వి రాజు ఆదేశాల మేరకు రాఖీ పౌర్ణమి సందర్భంగా విశాఖపట్నం జిల్లా కేంద్రకారా గారంలో ఖైదీలకు శుక్రవారం రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు.ఇందులో భాగంగా ఖైదీలందరికీ రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. జైల్లో ఉన్న కూడా తోబుట్టువుల స్థానంలో అండగా ఉంటామని దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు ఖైదీలకు భరోసా కల్పించారు.ఈ సంర్భంగా ఖైదీల మొహాల్లో సంతోషాన్ని చూసి దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు ఆనందం వ్యక్తం చేసారు.అనంతరం విశాఖపట్నం జైలు సూపరిండెంట్,ఇతర సిబ్బందికి రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. కంచెర్ల శ్రీదేవి,సౌత్ నియోజకవర్గం అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ,జిల్లా సెక్రెటరీ బేగం,జిల్లా సెక్రెటరీ పెరగడం వెంకటలక్ష్మి,ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు తౌటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధాన్ని చాటే రాఖీ పండుగ



**రాఖీ అంటే 'రక్షణ' అని అర్థముంది.**
**రాఖీ పండుగనే రక్షా బంధన్ అని పిలుస్తారు.**
**'రక్ష' అంటే రక్షించడం, 'బంధన్'సూత్రం కట్టడం అని అర్థం**





అన్న లేదా తమ్ముడు విజయం దిశగా అడుగేయాలని, అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుంటూ.రాఖీ కడుతుంది. సోదరుడి విజయాన్ని సోదరి కాంక్షిస్తే. ఏ కష్టమైనా నీకు అండగా నిలుస్తానని సోదరుడు హామీ ఇస్తాడు చేతుల్లో పెరిగాను, నీ వెనుకే తిరిగాను. నువ్వు గారం చేస్తుంటే పసి పాపనవుతా.. ఈ రక్షాబంధన్ సాక్షిగా దీవిస్తే సంతోషిస్తా.. అన్నయ్యా నన్ను దీవించు.. కలకాలం నన్ను ఇలాగే ప్రేమించు.. ప్రియమైన నీ చెల్లెలు. ఏడిస్తే ఊరడించావ్.. ఆకలేస్తే తినిపించావ్.. నాకు ఆనందం పంచడానికి అహర్నిశలు శ్రమించావ్.. అన్నయ్యా..ఏమిచ్చి నీ రుణం తీర్చుకోను.. మరు జన్మలోనూ నీ చెల్లినై పుట్టాలని కోరుకుంటూ రక్షా బంధన్ శుభాకాంక్షలు అలసిన వేళ అమ్మవై జోలపాడావ్.. అలిగిన వేళ అలక తీర్చి నాన్నవయ్యావ్.. చిరునవ్వును పంచి.. అనురాగాలకు అర్థం నేర్పి అన్నవయ్యావ్.. నీ చల్లని చూపే నాకు చాలు అన్నయ్యా.. రక్షా బంధన్ శుభాకాంక్షలతో.. నీ చెల్లెలు అన్నయ్యా.. చిరునవ్వుకు చిరునామావి మంచి మనసుకు మారురూపానివి మమతలకు ప్రాకారానివిఆప్యాయతలకు నిలువెత్తు రూపానివి రక్షా బంధన్ శుభాకాంక్షలతో నీ చెల్లెలు.. ప్రియమైన అన్నయ్యా.. తనకన్నా మంచి మనసున్న నిన్ను చూసి ఆ దేవుడు చిన్నబోయాడు నీ చెల్లెలుగా మరో అవతారం ఎత్తాలనుకున్నాడు. మమకారానికి ఆకారమైన అన్నయ్యా.. నీకిదే నా అక్షర పుష్పాంజలి. ప్రేమతో.. నీ చెల్లెలు. నీకెంత వయసొచ్చినా నా కంటికి చిన్న పిల్లవే.. కొండంత ప్రేమను పంచి నిండుగా దీవించే బంగారు చెల్లివే..

బుజ్జగింపు, ఊరడింపులు.. చిన్ననాటి మధుర స్మృతులను, తిరిగిరాని ఆ రోజులను గుర్తు చేసుకుంటూ.. మమతల మాగాణీలో పూసిన పువ్వులం స్నేహానురాగాలు నింపుకొన్న నవ్వులం అనురాగానికి ప్రతీకలం.. అనుబంధానికి ప్రతిరూపాలయిన అన్నాచెల్లెళ్లం చెల్లి నువ్వెప్పుడూ నవ్వుతూ ఉండాలి..

మనసే మధుమాసం మా చెల్లెమ్మ, ప్రేమే అనురాగం.. చిరునవ్వుల చెల్లెమ్మ,ఇంటికి అందం ముద్దుల చెల్లెమ్మ,నా కంటికి బంగారం మా చెల్లెమ్మ.. ఎన్నాళ్లయినా, ఎన్నేళ్లయినాఇగిరిపోని గంధం, చెరగని గ్రంథంవసి వాడని బంధం, మన అన్నాచెల్లెళ్ల అనుబంధం. అనుబంధాల హరివిల్లు ప్రేమాభిమానాల పొదరిల్లు గిల్లికజ్జాల సరదాలు తోడు నీడగా సాగిన జీవితాలు కాలం మారినా.. దూరం పెరిగినా.. చెరగని బంధాలు.. అవే అన్నా చెల్లెళ్ల అనుబంధాలు.. కలకాలం నిలవాలి ఈ రక్షాబంధం ఒక్క తల్లి బిడ్డలం కాకపోయినా.. అంత కంటే ఎక్కువ అనురాగాన్ని పంచాలి.

# తిరుమలలో వైభవంగా శ్రావణ పౌర్ణమి గరుడసేవ



తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో శుక్రవారం శ్రావణ పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు ధగధగ మెరిసిపోతున్న గరుడ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. గరుడవాహనం - సర్వపాప ప్రాయశ్చిత్తం.. పౌరాణిక నేపథ్యంలో 108 వైష్ణవ దివ్యదేశాల్లోనూ గరుడసేవ అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడినని తెలియజేస్తారు. అంతేగాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని నమ్మకం. తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ధర్మారెడ్డి, తితిదే అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు గరుడసేవలో పాల్గొన్నారు.

## కొండపడ మాజీ సర్పంచ్ కిముడు దేవన్న కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్

# కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుంది





అనంతగిరి (విజయభాను న్యూస్) : అరకు నియోజకవర్గం ముంచంగిపుట్టు మండలం ఏనుగురాయి పంచాయితి కొండపడ గ్రామానికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ కిముడు దేవన్న గత కొద్ది రోజుల క్రితం స్వర్గస్థులైన విషయం తెలిసిందే విషయం తెలుసుకున్న అరకు నియోజకవర్గ ఇన్చార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ కొండపడ గ్రామానికి చేరుకుని మాజీ సర్పంచ్ దేవన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. అనంతరం మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ దేవన్న కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలని దైర్యంగా ఉండలన్నారు అనంతరం కించాయిపుట్ పంచాయితి పెదపుట్టు గ్రామంలో సొరుకొండి గోపాల్ భార్య సొరుకొండి నాగమ్మ కుటుంబాన్ని పరామర్శించిన దైర్యంగా ఉండాలని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ భరోసా ఇచ్చారు మాజీ మంత్రి వెంట వనభా సింగి సర్పంచ్ లక్ష్మణ్,దారెల సర్పంచ్ పాండురంగ స్వామి,పెదబయలు మాజీ సర్పంచ్ తైసభూ త్రినాథ్,మండల టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పెలమల చిరంజీవి,మజ్జి చిన్ని బాబు,టీడిపి నాయకులు అర్జున్, బుద్దు,ప్రసాద్,కామేష్, ఐటీడీపి కో కన్వీనర్ శివ సాగర్ టీడీపీ సోషల్ మీడియా ప్రతినిధి మురళి తదితరులు గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# విశాఖలో 14 నుంచి అగ్నిపథ్ ర్యాలీ..

## ఏర్పాట్లు చేస్తున్న ఆర్మీ అధికారులు

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : సైన్యంలో అగ్నివీరులుగా విధులు నిర్వర్తించాలనుకునే వారికోసం విశాఖపట్నంలో ఈ నెల 14 నుంచి అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించనున్నారు. విశాఖలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో దేహదారుఢ్య పరీక్షలకు నియామక బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. 14 నుంచి ఈ నెల 31వ తేదీ వరకు రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కోనసీమ, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్ జిల్లాలు, యానాంకు చెందినవారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆర్మీ నియామక ర్యాలీ కోసం దాదాపు 60వేల మందికి పైగా అభ్యర్థులు నమోదు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. రిక్రూట్ మెంట్ ద్వారా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మ్యాన్(పది పాసైనవారు), అగ్నివీర్ ట్రేడ్స్‌మ్యాన్(8 పాసైనవారు)ని ఎంపిక చేస్తామని ఆర్మీ అధికారులు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇప్పటకే అడ్మిట్ కార్డులు కూడా జారీ అయ్యాయి. www.joinindianarmy.nic.in అంతర్జాల చిరునామా నుంచి అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. నియామకాలకు సంబంధించిన సందేహాల నివృత్తికి మొబైల్‌యాప్ army calling ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని అందులో అభ్యర్థులకు 'లైవ్ చాట్' సౌకర్యం కల్పించినట్లు వివరించారు. విశాఖలోని రిక్రూట్‌మెంట్ కార్యాలయం నంబర్లు 0891- 2756959, 2754680లకు ఫోన్ చేసి కావాల్సిన సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు.

# అంబేడ్కర్ భవన్ లో ధమ్మ దీక్ష కార్యక్రమం

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : శ్రావణ పూర్ణిమ సందర్భంగా పూజ్య భంతే అనాలయో(మైత్రేయ బుద్ధ విహారా వ్యవస్థాపకులు) చే శుక్ర వారం నగరంలోని రామా టాకీస్ దరి అంబేడ్కర్ భవన్ ప్రాగణంలో ధమ్మ దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. బాబాసాహెబ్ డా.బి. అర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ సౌజన్యంతో నూతనంగా నిర్మితమైన బహిరంగ సభావేదికకు ధమ్మచక్రప్రవర్తన దీక్షా వేదిక అనే నామ కరణంతో ప్రారంభోత్సవం చేశారు.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ , బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(విశాఖ. బ్రాంచి)సంయుక్త ఆధ్యర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో అనేక మంది భౌద్ధ ధర్మాన్ని స్వీకరించారు.బోధిసత్వ బాబాసాహెబ్ ఆశయం, ప్రభుద్దాభారత్ నిర్మాణ దిశగా కొనసాగింపు లక్ష్యంగా కృషిచేయాలని ప్రముఖులు సందేశ మిచ్చారు.ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఇంటి గురు మూర్తి,పి.రాజేశ్వరరావు, మల్లయ్య రాజు, గౌతంబాబు , ఎన్.బాల భాస్కరరావు, కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో విద్యార్థుల ర్యాలీ




మధురవాడ, (విజయభాను న్యూస్) : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆజాదీ క అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహా విశాఖ 6 వార్డు పరిధి పీఎం పాలెం చివరి బస్ స్టాప్ వద్ద గల సృజన స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు పాఠశాల ఆవరణ నుండి పీఎం పాలెం 2 వ బస్ స్టాప్ వరకు స్వాతంత్ర సమరయోధుల వేషధారణతో బారి ర్యాలీ నిర్వహించారు. మహాత్మా గాంధీ వేసాధరణ లో కే వి ఎస్ ఎస్ చేతన్, నెహ్రూ వేషధారణలో వివి రామ్, భగత్ సింగ్ వేషధారణలో వి చరణ్ తేజ అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ ఎస్ కె ఎండి షరీఫ్ మాట్లాడుతూ భారతదేశ అవునత్యాన్ని, స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను భావితరాలకు తెలిసే విధంగా ఈ ర్యాలీని ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండేలా ఈ ర్యాలీలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ ఎన్ ఎ రాధ, ఉపాధ్యాయులు ప్రసాదరావు, నాగ మనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## సచివాలయాన్ని సందర్శించిన డియస్ ఒ శివ ప్రసాద్



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం గొర్లి వానిపాలెం సచివాలయం నకు డియస్ ఒ శివప్రసాద్ సివిల్ సప్లైయస్ పై తనిఖీ కీ వచ్చి రైస్ కార్డ్స్ పై సూచనలు వాలంటీర్ కి అవకాహన కల్పించారు. అనంతరము రేషన్ డిపో కూడా పరిశీలన చేసి పిఎమ్ కెవైసి రైస్ ఎమ్ డియు రైస్ స్టాక్ పరిశీలన చేసారు. ఈ కార్యక్రమంలో విఅర్వో గౌరి,పరవాడ విఅర్వో వెంకటేశ్వరావు, వాలెంటర్లీ తథితర్లు పాల్గోన్నారు.

# గీతం స్మార్ట్ ఐడియాథాన్ -2022 విజేత "ఫీట్ వింగ్స్"




సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : జాతీయ స్థాయిలో నూతన ఆలోచనలను ప్రోత్సహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (విడిసి), స్టార్టప్ ఇండియా, ఇన్‌వెస్ట్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్న "స్మార్ట్ ఐడియాథాన్-2022" పోటీల ఫైనల్స్‌లో బీహార్‌కు చెందిన నేతాజీ సుభాష్ యూనివర్సిటీ ఫీట్ వింగ్స్ జట్టు విజేతగా నిలిచి రెండు లక్షల రూపాయల నగదు బహుమతిని అందుకుంది. మధుమేహ వ్యాధి గ్రస్తులలో కాలి అల్సర్‌లు నివారించడానికి ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటి) ద్వారా పరిష్కారం చూపుతూ "ఫీట్ వింగ్స్" స్టార్టప్‌ను నెలకొల్పిన అనిమేష్ కుమార్, హృతిక్ జైస్వాల్ లకు నిర్వహకులు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బహుమతి మొత్తాన్ని అందజేసారు.బదిరుల కోసం మద్రాస్ క్రిస్టియన్ కళాశాల విద్యార్థులు కార్తిక్ జ్యోతి, మోతీష్ రూపొందించిన అలిట్రిజ్ అనే పరికర తయారీ సంస్థ ద్వితీయ స్థానంలో నిలిచి లక్ష రూపాయలు నగదు బహుమతిను అందుకుంది. తమిళనాడులోని శరణాధన్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినిలు అమృత లక్ష్మి, కరోలిన్ మేరీ రూపొందించిన వీల్‌చైర్ ఆలోచనకు ఉత్తమ మహిళా ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు లభించగా తమిళనాడుకే చెందిన రాజ్యలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రవీణ్ కుమార్, నబీల్ రూపొందించిన డెక్‌స్ట్రోవేర్ అనే ఆరోగ్య పరికరానికి స్వర్గీయ లెబెన్ జాన్సన్ పీపుల్స్ ఛాయిస్ అవార్డు లభించింది. ఐఐటి గౌహతి విద్యార్థులు కె.ఫృద్వీ, హరిహంత్ సింఘి దృష్టి లోపం ఉన్నవారి కోసం రూపొందించిన బ్రెయిలీ ప్రింటర్ కు ఉత్తమ బిజినెస్ ఐడియా అవార్డు అందజేశారు.

ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ అంతర్జాతీయ డైరక్టర్ ప్రొఫెసర్ గ్రెగ్ కొలియర్, సెంటర్ ఫర్ ఎమర్జింగ్ మార్కెట్ డైరక్టర్ ప్రొఫెసర్ రవి రామమూర్తి, స్టార్టప్ ఇండియా మేనేజర్ డాక్టర్ సురభి గుప్తా, స్టోన్ సోప్ సహ వ్యవస్థాపకురాలు మాలినీ పరమార్, స్టార్టప్ ఇకో సిస్టమ్ ఉపాధ్యక్షురాలు డి.శ్రీదేవి వ్యవహరించారు. పోటీలలో విజేతలకు నగదు బహుమతితో పాటు అమెరికాలోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ సెంటర్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ఎడ్యుకేషన్ మరియు సెంటర్ ఫర్ ఎమర్జింగ్ మార్కెట్ నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో జరిగే ప్రత్యేక శిక్షణకు పంపడం జరుగుతుందని గీతం వెంచర్ డవలప్‌మెంట్ సెంటర్ డైరక్టర్ ప్రొఫెసర్ రాజా.పి.పప్పు తెలిపారు. విజేతలను గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ అభినందించారు.




# క్రీడలు మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయి

## -రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్



గాజువాక (విజయభాను న్యూస్ ): నిత్యం వృత్తి పరమైన సవాళ్లతో కూడిన ఒత్తిడిని ఎందుర్కొంటున్న జర్నలిస్ట్ లకు క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని రాష్ట్ర భారీ పరిశ్రమల శాఖామత్యులు గుడివాడ అమర్నాథ్ అన్నారు. శుక్ర వారం హిందూస్తాన్ జింక్ క్రికెట్ గ్రౌండ్ లో గాజువాక జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసిఏషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాజువాక జర్నలిస్టు క్రమ శిక్షణకు మారుపేరుగా కొనియాడారు. ఎంతో ఐక్యమత్యంతో వ్యవహరిస్తూ అందరినీ ఒకే వేదిక పైకి తీసుకు రావడం ఆనందదాయకమని ప్రశంసించారు. జర్నలిస్ట్ లకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, తనను ఈ కార్యక్రమంలో భాగస్వామిని చేసినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గాజువాక మాజీ ఎమ్మెల్యే, విశాఖ పార్లమెంటరీ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడా పోటీల నిర్వాహకులను అభినందించారు. జర్నలిస్టులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని, ఆరోగ్యాన్ని కాపాడు కొనడానికి క్రీడలు దోహద పడతాయని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట రామయ్య, జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు, కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి, కేబుల్ మూర్తి, 64 వార్డ్ ఇంఛార్జి ధర్మాల శ్రీనివాస్, గ్రౌండ్ ఇంఛార్జి పురుశోత్తమ రెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్ భూపతిరాజు శ్రీనివాసరాజు, కమిటీ ప్రతినిధులు కాకినాడ ఈశ్వరరావు, పితాని ప్రసాద్, కోయిలాడ పరశురాం, మూల గిరిబాబు, కృష్ణ, మూర్తి, శశి, ప్రకాష్, గోవింద్, శ్రీను, నాయుడులు పాల్గొనగా జిల్లా వ్యాప్తంగా ఆరు క్రికెట్ టీమ్ లు పాల్గొన్నాయని నిర్వాహుకులు తెలిపారు.



# ఏపీలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది బదిలీలకు రంగం సిద్ధం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది బదిలీలకు రంగం సిద్ధమవుతోంది. సిబ్బంది ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా బదిలీలకు అవకాశం కల్పించాలని సీఎం జగన్‌ను కోరగా.. బదిలీలకు ముఖ్యమంత్రి అంగీకరించినట్టు ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ ఛైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి తెలిపారు. బదిలీలపై త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తామని సీఎం చెప్పినట్టు ఆయన తెలిపారు. దాదాపు 25 ఏళ్ళుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న 237 మంది ఎంపీడీవోలకు డిప్యూటీ సీఈవోలుగా, డీడీవోలుగా ఒకేసారి పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై ఎంపీడీవోల సంఘం అధ్యక్షుడు వై.బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి జీవీ నారాయణరెడ్డి తదితరులతో పాటు వెంకట్రామిరెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిసి సన్మానించి, ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వెంకట్రామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. "గతంలో ఒక టీచరు 8 సంవత్సరాలు ఒకేచోట పనిచేసిన తర్వాతే బదిలీ చేసేవారు.



# జిల్లాలో అన్ని వార్డుల అభివృద్ధి కి కృషి


## -జీవీఎంసీ మేయర్ గోలగాని హరి వెంకట కుమారి



ములగాడ (విజయభాను న్యూస్) : విశాఖ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తున్నట్లు జీవీఎంసీ మేయర్ గోలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. జీవీఎంసీ 58 వార్డ్ ఎదురువాణిపాలెం గ్రామంలో రూ 40.53 లక్ష వ్యయంతో నిర్మించిన సి సి రోడ్డు, ములగాడ గ్రామంలో 13.80 లక్షల తో నిర్మించిన సామజిక భవనంనకు జీవీఎంసీ ప్రథమ మేయిర్ గోలగాని హరి వెంకట కుమారి 58 వ వార్డ్ కార్పొరేటర్ గులిగిందల లావణ్య, కొరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వైస్ చైర్మన్ ప్రదీప్ ల చేతులు మీదుగా శుక్రవారం ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ 58వ వార్డ్ అభిరుద్దికి సంపూర్ణ సహకారం అందుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గులిగిందాల లావణ్య మాట్లాడుతూ వార్డ్ అభివృద్ధి తమ లక్ష్యం అని వార్డ్ మోడల్ వార్డ్ గా తీర్చుదిద్దుతామణి తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ వైకాపా అధ్యక్షులు గులిగిందల కృష్ణ,ఈఈ ప్రసన్న కుమారి, డిఈ ఎడుకొండలు, అప్పలస్వామి, ఎదురు రాజు, రమణి, శ్రీరామ్ మూర్తి, చంద్రరావు, బాబీ, నాగేశ్వరావు, వేణుగోపాల్ రెడ్డి, పెద్దాడ రమణ, వరలక్ష్మి, పొట్టి మూర్తి, కారాడ రాము, భూపతి, కృష్ణ అప్పారావు, గాలి సన్యాసి రావు, నారాయణ రావు, రాంబాబు, కన్నబాబు, జగన్నాధం, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# వీధి బాలలను సంరక్షించాలి

## - జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : బాలల హక్కుల ఉల్లంఘన జరగకుండా కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆయన ఎన్.ఐ.సి కాన్ఫరెన్స్ హాల్లో బాలల సంక్షేమ సమితి త్రైమాసిక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ బాలల హక్కుల ఉల్లంఘన లేకుండా సమైక్యతతో పనిచేయాలని సూచించారు. బాలలు పాఠశాలలు లేదా గృహాల్లో ఉండాలని, వీధుల్లో ఉండకూడదని అలా వున్న వారిని సంరక్షణ గృహాల్లో ఉంచి పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి సంబంధిత అధికారులను ఆదేశించారు . బాల కార్మికులను గుర్తించాలని అదే విధంగా బాల్య వివాహాలను నిరోధించాలని స్పష్టం చేశారు. బాలల న్యాయ రక్షణ మరియు సంరక్షణ చట్టం 2015 అనుసరించి, బాలల హక్కుల ఉల్లంఘన జరగకుండా చూడవలసిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు.

జిల్లాలో తప్పిపోయిన బాల బాలికలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పోలీసు స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాలల సంక్షేమ సమితి బాలలకు అవగాహన కల్పించాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతుల విషయమై ప్రత్యేక దృష్టితో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ అనే నినాదంతో అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేసారు. ఈ ప్రతిజ్ఞ ప్రతి పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులతో చేయించాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే దుష్పరిణామాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, విద్యా సంస్థలు,యూనివర్సిటీ క్యాంపస్‌లు మరియు పాఠశాలలపై దృష్టి పెట్టాలని, వారికి అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఈ సమావేశంలో బాలల సంరక్షణ గృహ నోడల్ అధికారి శరత్, వికలాంగుల సంక్షేమ అధికారి సుబ్బి రెడ్డి, కెజిహెచ్ ఆర్.ఎమ్.ఓ డా.వాసు దేవ, బాలల సంక్షేమ సమితి చైర్మన్ రాధ, చైల్డ్ లైన్ సభ్యులు, లేబర్, సమగ్ర శిక్షా, జిల్లా మహిళా, బాలల రిహాబిలిటేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు .

# ప్లాస్టిక్ నియంత్రణపై "పార్లే ఫర్ ది ఓషన్స్" సంస్థ ప్రతినిధితో కమిషనర్ సమావేశం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నగరంలో ప్లాస్టిక్ నియంత్రనపై తీసుకుంటున్న చర్యలను గూర్చి

న్యూయార్క్ ఎన్జిఒ సంస్థ "పార్లే ఫర్ ది ఓషన్స్" ప్రతినిధి జోనాస్ జెర్ర్ తో జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ శుక్రవారం ఆయన ఛాంబర్ లో సమావేశం జరిపారు. ఈ సందర్భంగా నగరంలో ప్లాస్టిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, వాటి నిర్వాహణ తదితర అంశాలపై చర్చించారు. నగరంలో కాలుష్యం పెరుగుతుందని దాని నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం, జివిఎంసి అనేక చర్యలు చేపట్టిందని, నగరంలో పూర్తిగా నిషేధిత ప్లాస్టిక్ ను నియంత్రించి ప్రత్యామ్నాయంగా భూమిలో త్వరగా మిలితమయ్యే గుడ్డ, నార, కాగితపు సంచులను వాడుకలోని తీసుకొచ్చామని తెలిపారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ మేళా ఈ 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు బీచ్ రోడ్డులో ఏర్పాటుచేస్తున్నామని, అందులో వివిధ రకాల సహజ అటవీ ఉత్పత్తుల ప్రదర్శన ఈ మేళాలో ఉంటాయని తెలిపారు. నగరంలో సేకరిస్తున్న వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. నగరంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి గాలి కాలుష్యం నియంత్రణకు కృషి చేయడం జరుగుతుందన్నారు. జివిఎంసి అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు వారంలో ఒక్క రోజు తమ స్వంత వాహనాలను విడనాడి ప్రజా రవాణా ద్వారా కార్యాలయమునకు చేరుకోవడం ద్వారా కొంతవరకు కాలుష్యాన్ని నియంత్రంచ గలుగుతున్నమన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com